**నమ్మలేని నిజాలు**

కొత్త ధ్వనులు
కాలంతో పాటురసం
సినీ గీతాలు.

పాలన కోసం
మారింది గ్రేటర్ బాట
ముచ్చటగా త్రై.

చెలది తెర
జనం మత్తు వ్యసనం
విహారి భోగం.

పలురోగాలు
మందులు మనీ నిల్లు
హౌటు పే బిల్లు

విజ్ఞాన భాండం
తూనిక రాళ్లు లేవు
నీ బరువెంత?.



- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

**శ్రీనిజాలు**

పట్టనట్టు ఊరకుండె
మిత్రరాజ్య గుంపు !
విర్రవీగి కాలు దువ్వి
తెల్లబోయె ట్రంపు !
యుద్ధంలో ఒంటరయ్యి
అమెరికా వెనుకడుగు !
పరుగులెత్తి బొక్క బోర్ల
పడ్డట్టేను మదుగు !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 26-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:176 పేజీలు:6 వెల: రూ.1/-


## తెలంగాణ అసెంబ్లీలో డబుల్ బెడ్ రూం ఇళ్లపై చర్చ..

హైదరాబాద్, మార్చి 25: 99 రోజుల ప్రణాళికలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పేదలకు కేటాయిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూం ఇళ్లపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎన్ని ఉన్నాయి.. వాటిలో ఎన్ని పూర్తయ్యాయి.. ఇంకా ఎన్ని పూర్తి కావాల్సి ఉందనే దానిపై తమ వద్ద సమాచారం ఉందన్నారు. ఇంతలో ఎమ్మెల్యే కె. వెంకటరమణా రెడ్డి జోక్యం చేసుకుంటూ.. ఇందిరమ్మ ఇల్లు మంచి పథకమన్నారు.

వీటి వల్ల పేదలకు లబ్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో కట్టిన డబుల్ బెడ్ రూం ఇల్లు నాసిరకంగా ఉండడంతో శిథిలావస్థకు చేరాయని విమర్శించారు. ఇప్పటికే పూర్తయి ఎవరికి కేటాయించని డబుల్ బెడ్ రూం ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి జోక్యం లేకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చొరవ చూపాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

### గ్రేటర్‌లో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించారు: ఎమ్మెల్యే దానం

గ్రేటర్ హైదరాబాద్‌లో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించారని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. ఇప్పటికే పూర్తయి.. ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వీలైనంత త్వరగా లబ్ధిదారులకు అందజేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఖైరతాబాద్‌లో 5 ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టేందుకు శంకుస్థాపన చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

### బీఆర్ఎస్ హయాంలో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించిందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గుర్తు చేశారు. చిన్న చిన్న రిపేర్ల కారణంగా వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇంకా లబ్ధిదారులకు అందజేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పార్టీని దృష్టిలో పెట్టుకుని డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీలు చెప్పే వారికే ఇళ్లు ఇస్తామంటున్నారని సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు.

### అల్లుడు వస్తే ఏడుంటడు, బిడ్డ వస్తే ఏడుంటడు: ఎమ్మెల్యే వంశీ కృష్ణ

అల్లుడు వస్తే ఏడుంటడు, బిడ్డ వస్తే ఏడుంటడు అని గతంలో మాట్లాడిన కేసీఆర్.. గత పదేళ్ళలో అసలైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వలేదని బీఆర్ఎస్ అధినేతపై ఎమ్మెల్యే వంశీ కృష్ణ మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లకు సైతం కాలం చెల్లడంతో అవి శిథిలావస్థకు చేరాయని పేర్కొన్నారు. వారికి సైతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. జాయింట్ ఫ్యామిలీని రీ ఎంక్వరీ చేసి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వానికి ఆయన స్పష్టం చేశారు.

### వచ్చే ఏడాది కేటాయించిన ఇళ్లకు నిధులు ఎలా?: ఎమ్మెల్యే పల్లా

ఇందిరమ్మ ఇళ్లకు బడ్జెట్‌లో రూ. 5 వేల కోట్లు కేటాయించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇంకా పూర్తి కాని వాటికే ఈ రూ.5 వేల కోట్లు సరిపోవని చెప్పారు. వచ్చే ఏడాది కేటాయించిన ఇళ్లకు నిధులు ఎలా ఇస్తారంటూ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇంతలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని.. పల్లా రాజేశ్వర్ రెడ్డి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గానికి నాలుగున్నర లక్షల ఇళ్లు అన్ని పల్లా మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు.

నియోజకవర్గానికి అన్ని ఇళ్లు ఉంటాయా అంటూ సందేహం వ్యక్తం చేశారు. సభను పక్కదారి పట్టించడమే ఏజెండాగా పెట్టుకున్నారని పల్లాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల కోసం పెట్టిన బడ్జెట్‌ను బీఆర్ఎస్ విమర్శిస్తుందా.. అంటూ సందేహం వ్యక్తం చేశారు. బడ్జెట్ పుస్తకాలను చించి పేదలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అవమానించారంటూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిప్పులు చెరిగారు.

## కువైట్ విమానాశ్రయంపై ఇరాన్ డ్రోన్ దాడి.. ఎగిసిపడుతున్న మంటలు

న్యూఢిల్లీ, మార్చి 25:పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు రోజురోజుకీ భీకర స్థాయికి చేరుకుంటున్నాయి. యుద్ధం మొదలైనప్పటికి నుంచి గల్ఫ్ దేశాలపై ఇరాన్ డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. తాజాగా కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం లక్ష్యంగా డ్రోన్ దాడికి పాల్పడింది. డ్రోన్ ఓ ఆయిల్ ట్యాంకర్‌ను ఢీ కొట్టడంతో మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. బుధవారం తెల్లవారుజామున ఇరాన్‌కు చెందిన డ్రోన్లు కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం లక్ష్యంగా దూసుకెళ్లాయి. అందులో ఒక డ్రోన్ విమానాశ్రయ పరిసరాల్లో ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను ఢీ కొట్టింది.

ఈ ప్రమాదం దాటికి ట్యాంకర్ పేలిపోవడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. విమానాశ్రయం పరిసర ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేయడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్.. డ్రోన్లతో గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతోంది. తాజా దాడి కువైట్ భద్రతా వ్యవస్థలను అప్రమత్తం చేసింది. ఈ ఘటనపై కువైట్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. మంటలు అదుపు చేసేందుకు రెస్క్యూ టీమ్ తీవ్రంగా శ్రమిస్తోంది. ఇదిలా ఉంటే.. ఇరాన్ నుంచి వచ్చిన పలు డ్రోన్లు, క్షిపణులను తమ రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని కువైట్ దళాలు పేర్కొన్నాయి. ఈ ఘటనలో ప్రాణ నష్టం జరగలేదని, కేవలం ఆస్తి నష్టం జరిగిందని కువైట్ సివిల్ ఏవియేషన్ అథారిటీ ధ్రువీకరించింది.

## దేశంలో 100 కొత్త ఎయిర్‌పోర్టులు.. కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ, మార్చి 25: ప్రాంతీయ ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు దేశంలో 100 కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మిండానికి కేంద్రం సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీనిలో భాగంగా ఎయిర్‌పోర్టులతోపాటు, హెలిపోర్టులు, వాటర్ ఏరోడ్రోమ్స్‌ను కూడా కేంద్రం నిర్మించనుంది. 2026-2027 నుంచి 2035-2036 వరకు, పదేళ్లపాటు ఉడాన్ స్కీమ్ కింద వీటిని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

దీనికోసం రూ.28,840 కోట్లను కేంద్రం కేటాయించనుంది. దీని ద్వారా చిన్న పట్టణాలకు ప్రాంతీయ ఎయిర్ కనెక్టివిటీ పెరుగుతుందని కేంద్రం చెబుతోంది. ఏవియేషన్ నెట్‌వర్క్‌ను విస్తరించడం, ప్రాంతీయ రవాణా వ్యవస్థ బలోపేతం, ఆర్థిక రంగానికి ఊతమివ్వడం వంటి లక్ష్యాలతో కేంద్రం కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టనుంది. ఇప్పటివరకు ఎయిర్ కనెక్టివిటీ లేని టైర్ 2 పట్టణాల నుంచి టైర్ 3 పట్టణాల వరకు, హిల్ స్టేషన్లు, సరిహద్దు ప్రాంతాలు, ఐలాండ్స్ ఇలా మొత్తంగా 100 ఎయిర్‌పోర్టులు వంటివి నిర్మిస్తారు. అలాగే, ఎయిర్‌పోర్టులు నిర్మించడానికి వీలుకాని ప్రదేశాల్లో 200 ప్రత్యేక హెలిప్యాడ్లు, వాటర్ ఏరోడ్రోమ్స్ వంటివి కూడా నిర్మితమవుతాయి.

## ఆయిల్ ఫామ్‌కు అనువైన తెలంగాణ నేల: మంత్రి తుమ్మల

హైదరాబాద్, మార్చి 25:పంట మార్పిడిపై దృష్టి పెట్టాలని తెలంగాణ రైతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఆయిల్ ఫామ్‌కు అనువైన ప్రాంతం తెలంగాణ అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలు ఆయిల్ ఫామ్ పంటకు అనుకూలంగా ఉందని మంత్రి తుమ్మల వివరించారు. బుధవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. అనంతరం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయనపై విధంగా సమాధానం ఇచ్చారు. అకాల వర్షాలతో నష్టపోయిన పంట వివరాలు సేకరిస్తామని పేర్కొన్నారు. దీనిపై త్వరలో ఒక ప్రకటన చేస్తామని మంత్రి తుమ్మల వివరించారు.

## శత్రువులు పశ్చాత్తాప పడేవరకూ ప్రతీకార దాడులు ఆగవు: ఇరాన్



న్యూఢిల్లీ, మార్చి 25:ఇరాన్ - ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించే దిశగా చర్చలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్తున్నప్పటికీ.. ఇరాన్ నుంచి వస్తోన్న సందేశాలు మాత్రం ధిక్కార ధోరణిని కనబరుస్తున్నాయి. ఆ రెండు దేశాలు చేసిన దురాక్రమణకు గానూ.. వారు పశ్చాత్తాప పడేంత వరకూ తమ దాడులు కొనసాగిస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తేల్చి చెప్పారు. తమ మిత్ర దేశం చైనాతో ఫోన్ సంభాషణలో భాగంగా అరాగ్చీ ఈ వ్యాఖ్యలు చేసినట్టు మీడియా కథనాలు వెల్లడించాయి.

ఇస్లామిక్ రిపబ్లిక్‌కు చెందిన పౌర, రక్షణ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా శత్రు దేశాలు దాడులు చేయడంతోనే టెహ్రాన్‌లో అస్థిరత చోటుచేసుకుందని అరాగ్చీ తెలిపారు. 'మా లక్ష్యాలన్నీ నెరవేరడం సహా హింసాత్మక దురాక్రమణకు పాల్పడిన శత్రు దేశాలు పశ్చాత్తాప పడేవరకూ ప్రతీకార దాడులు కొనసాగుతాయి. దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడమే మా తొలి ప్రాధాన్యం' అని ఇరాన్ విదేశాంగ మంత్రి చెప్పారు. హోర్ముజ్ జలసంధిలో నెలకొన్న అభద్రతకు ఈ దురాగతాలే ప్రత్యక్ష కారణమని ఆయన అన్నారు. అందులో భాగంగానే హోర్ముజ్ జలసంధిని మూసివేశా మని.. తాము తీసుకున్న చర్యలన్నీ అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే ఉన్నాయని వివరించారు.మరోవైపు.. ఇరాన్‌తో దౌత్యపరమైన చర్చలకు అమెరికా సంకేతాలిస్తుండగా.. టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ గూఢచర్య కేంద్రాలే లక్ష్యంగా వరుస దాడులు ప్రారంభించినట్టు ఐఆర్‌జీసీ తెలిపింది. ఇరాన్‌లో ప్రముఖ వ్యక్తులతో తమ చర్చలు కొనసాగుతున్నాయని, ఇది పాలనాపరమైన మార్పునకు సంకేతమని యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ పేర్కొన్న తరుణంలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

## ఆ ఇళ్లను కొత్త వారికి ఇస్తాం: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, మార్చి 25:శాసనసభ సమావేశాల్లో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష చేపట్టి, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 21 లక్షల ఇళ్లు నిర్మించారని తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష ఇళ్లకు అనుమతులు ఇచ్చిందని చెప్పారు. అయితే, ఆ ఇళ్లలో అనేక పనులు పూర్తి కాలేదని మంత్రి వెల్లడించారు. సుమారు 70 వేల ఇళ్లలో చిన్నపాటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, మరో 26 వేల ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. ఈ అసంపూర్తి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు.ఇక గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్లలో 12 వేల ఇళ్లను ఇప్పటికీ లబ్ధిదారులు ఆక్యూపై చేయలేదని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు మూడు నెలల గడువు ఇచ్చి నోటీసులు జారీ చేయగా, అం దులో 6 వేల మంది ఇళ్లను ఆక్యూపై చేసుకున్నారని చెప్పారు. మిగిలిన ఇళ్లను అర్హులైన కొత్త లబ్ధిదారులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే, పూర్తి కాకుండా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎంత ఖర్చు అయినా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా త్వరలో లబ్ధిదా రులకు అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై అన్ని పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి త్వరలో హైదరాబా ద్‌లో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

## పెట్రోల్, డీజిల్ కొరత లేదు.. భయపడకండి: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, మార్చి 25: రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందనే వార్తల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇంధన కొరత లేదని, అవసరానికి సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపారు.

రెండు నెలలకు సరిపడా పెట్రోల్, డీజిల్ స్టాక్ రాష్ట్రంలో ఉందని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తోందని, అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. సివిల్ సప్లై శాఖ మొత్తం పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని తెలిపారు. ప్రజలు రూమర్స్, ఫేక్ న్యూస్‌ను నమ్మవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. ముఖ్యంగా డ్రమ్స్, కంటైనర్లలో పెద్ద ఎత్తున ఇంధనం నిల్వ చేయడం చట్ట విరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇక, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంధన డిమాండ్ సుమారు 25 శాతం పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 1200 ట్యాంకర్ల ద్వారా సరఫరా జరుగుతోందని చెప్పారు. పెట్రోల్ బంక్‌లు అనవసరంగా మూసివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అహ్మదాబాద్, సూరత్, నాగపూర్, చెన్నై వంటి నగరాల్లో కూడా ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే బంక్‌లకు ఎలాంటి క్రెడిట్ సమస్యలు లేవని, సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగుతోందని స్పష్టం చేశారు.

## ఢిల్లీ అసెంబ్లీకి బాంబు బెదిరింపు..

న్యూఢిల్లీ, మార్చి 25: ఢిల్లీ అసెంబ్లీకి బుధవారంనాడు బాంబు బెదిరింపు రావడం కలకలం రేపింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ బాంబు బెదిరింపులు రావడం గత 24 గంటల్లో ఇది రెండో సారి. ముఖ్యమంత్రి రేఖాగుప్తా మంగళవారంనాడు బడ్జెట్ సమర్పణకు కొన్ని గంటలకు ముందు బాంబు బెదిరింపు వచ్చింది. తొలుత అసెంబ్లీకి, ఆ తర్వాత స్పీకర్ విజేందర్ గుప్తాకు బెదిరింపు ఈమెయిల్స్ వచ్చా యి. వెంటనే చేపట్టిన తనిఖీల్లో ఆ బెదిరింపులు ఉత్తవేనని తేలాయి. దీంతో సీఎం బడ్జెట్ సమర్పణ ఆలస్యంగా జరిగింది.

తాజాగా అసెంబ్లీ ఆవరణలో బాంబులు పెట్టామంటూ స్పీకర్ అధికారిక ఈమెయిల్ ఐడీకి సమాచారం వచ్చినట్టు అధికారులు బుధవారంనాడు తెలిపారు. దీంతో సెక్యూరిటీ ఏజెన్సీలు అసెంబ్లీ ఆవరణలో తనిఖీలు నిర్వహించాయి.

బాంబు డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, స్థానిక పోలీసు బృందాలు క్షుణ్ణంగా పరిశీలించి బాంబులు కానీ, ఎలాంటి పేలుడు పదార్థాలు కానీ లేవని నిర్ధారించాయి. బెదిరింపు కాల్స్‌ను తాము సీరియస్‌గా తీసుకుంటున్నామని, తనిఖీలు, నిఘా పెంపు వంటి చర్యలు తీసుకుంటున్నామని పోలీసు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈమెయిల్స్ ఎక్కడి నుంచి వచ్చాయని తెలుసుకునేందుకు సైబర్ నిపుణులు, సెక్యూరిటీ ఏజెన్సీలు విచారణ చేపట్టాయి. ఐపీ ట్రాకింగ్, ఈమెయిల్ హెడర్ అనాలసిస్ నిర్వహిస్తున్నాయి

## గ్యాస్ బుకింగ్‌కు 35 రోజుల విరామం.. నిజం కాదని ప్రకటించిన కేంద్రం..



న్యూఢిల్లీ, మార్చి 25:పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల కారణంగా దేశంలో చమురు, గ్యాస్ కొరతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ప్రజలను భయపెట్టేలా రకరకాల వార్తలు ప్రచారంలోకి వస్తున్నాయి. వంట గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువును చమురు కంపెనీలు 35 రోజులకు పెంచినట్టు మంగళవారం వార్తలు హల్‌చల్ చేశాయి. ఆ వార్తలపై తాజాగా కేంద్ర ప్రభుత్వం స్పందించింది ఎల్పీజీ బుకింగ్ సమయాల్లో ఎలాంటి మార్పులూ లేవని కేంద్రం పెట్రోలియం శాఖ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. 'గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువు పెంపుపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు నిజం కాదు. గ్యాస్ బుకింగ్ సమయాల్లో ఎలాంటి మార్పులూ లేవు. కనెక్షన్‌తో సంబంధం లేకుండా పట్టణ ప్రాంతాల్లో రీఫిల్ బుకింగ్‌కు 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల గడువు ఎప్పటిలాగానే కొనసాగుతుంది' అని కేంద్రం ఓ ప్రకటన విడుదల చేసింది.

గ్యాస్ బుకింగ్ విషయంలో ఆందోళనలు వద్దని, అలాగే అవసరం లేకపోయినా బుకింగ్‌లు చేయవద్దని ప్రజలకు కేంద్రం సూచించింది రెండు సిలిండర్లు ఉంటే గ్యాస్ బుకింగ్ మధ్య అంతరాయాన్ని 35 రోజులకు పెంచినట్టు మంగళవారం నుంచి వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఆ వార్తలన్నీ అబద్ధాలని కేంద్రం ప్రకటనతో తాజాగా తేలింది.

**చురక**

తరాలు మారుతుంటే
తప్పదు కదా అంతరం
సమన్వయం లోపిస్తే
సంఘర్షణే నిరంతరం.
సాంప్రదాయ కట్టుబాట్ల
సడలింపే మరీ ముఖ్యం
కొత్తనీరు జీవ నదిలా
కొనసాగితే కదా సౌఖ్యం



-వేల్పుల నారాయణ
9440433475

మనము నూయల లూపు
భావాల కొక రూపు
నిచ్చు సత్కవి చూపు
అనును రాధశ్రీ !!
పాపములు మది కద్దు
భవహంధములు వద్దు
పరుల సేవయె ముద్దు
అనును రాధశ్రీ !!

## ఢిల్లీలో డబుల్ డెక్కర్ బస్సు బోల్తా.. ఇద్దరు మృతి.. పలువురికి గాయాలు

న్యూఢిల్లీ, మార్చి 25: దేశ రాజధాని ఢిల్లీలో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. డబుల్ డెక్కర్ బస్సు బోల్తా పడటంతో ఇద్దరు మరణించగా, మరికొందరు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం తెల్లవారు ఝామున ఒంటి గంట సమయంలో ఢిల్లీలోని కరోల్ బాగ్ ప్రాంతంలోని హనుమాన్ మూర్తి చౌక్ వద్ద జరిగింది.

25 మంది ప్రయాణికులతో జైపూర్ నుంచి వస్తున్న బస్సు అతివేగం కారణంగా అదుపు తప్పి, బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, మిగతా ప్రయాణికులు గాయపడ్డారు. అర్ధరాత్రి దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు అక్కడికి చేరుకుని బాధితుల్ని రక్షించే చర్యలు చేపట్టారు. బోల్తా పడ్డ బస్సు లోపల చిక్కుకున్న ప్రయాణికుల్ని బయటకు తీశారు. స్థానికులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. చీకట్లో సహాయక చర్యలకు కొంత ఆటంకం ఏర్పడింది. అయినప్పటికీ బాధితుల్ని బయటకు తీసి, క్షతగాత్రుల్ని ఆస్పత్రులకు తరలించారు. ఢిల్లీలోని ప్రముఖ ఆస్పత్రులైన సర్ గంగారాం హాస్పిటల్, రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్‌కు బాధితుల్ని తరలించారు.

వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాల కారణంగా ఇద్దరు మరణించారు.

## అమ్రాబాద్ గిరిజనుల పునరావాసం.. ప్రభుత్వం కీలక నిర్ణయం



హైదరాబాద్, మార్చి 25 :అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో నివసిస్తున్న గిరిజనుల పునరావాసానికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గిరిజనుల అభీష్టం మేరకే పునరావాసం చేపడుతున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొదటి దశలో నాలుగు గ్రామాలకు చెందిన 417 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా అసెంబ్లీ కౌన్సిల్ హాల్‌లో 14 గిరిజన కుటుంబాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నారు.

ఈ పథకంలో భాగంగా 160 కుటుంబాలకు నగదు పరిహారం ఇవ్వగా, 257 కుటుంబాలకు ఇల్లు, 5 ఎకరాల భూమిని కేటాయిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బచారం వద్ద ఆధునిక సదుపాయాలతో పునరావాస కాలనీని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం మొత్తం రూ.62.55 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. పునరావాసం తర్వాత గిరిజన కుటుంబాలకు పక్కా ఇళ్లు, తాగునీరు, విద్యుత్, ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. గిరిజన పిల్లలకు ఆధునిక పాఠశాలలు, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు కూడా కల్పించనున్నారు.

దేశంలోనే అత్యధిక పరిహారాల్లో ఒకటిగా భావిస్తున్న రూ.15 లక్షల ప్యాకేజ్ ద్వారా గిరిజనులకు ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా, ఈ పునరావాసం ద్వారా సుమారు 1501 హెక్టార్ల అటవీ భూమి పునరుద్ధరణకు అవకాశం లభించనుంది. పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు ఇది కీలకంగా మారనుంది. బచారం పునరావాస కాలనీని మోడల్ గ్రామంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## అక్షరాల అలలు

సముద్రం నుంచి కెరటాలు మాయం
ఎవరో వలవేసి లాక్కుపోయారు
అక్షరాలను అలలు చేసి అందించాను
సముద్రం తిరిగి ఉప్పొంగుతోంది
మేఘాలతో ఆకాశం చప్పట్లు కొట్టిస్తూ



-డా. కె.జి. వేణు
98480 70084

నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

## ఘంటారావం

నిజీయితీ లేనిచోట
నమ్మకం నీటిమూట
జ్ఞానం లేనిచోట
శ్రవణం ఒట్టిమాట

నిన్నటి కశ్మీర్
రగిలే బుల్లెట్
నేటి కశ్మీర్
రాజిల్లే క్రికెట్.

చెవులు
కుందేళ్ళవనీ
నోరు
తాబేలవనీ.

నిజాన్ని
అబద్ధమనకు
అబద్ధాన్ని
నిజం చేయకు



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

# మనిషిలో మార్పును తెచ్చేవే మంచి రచనలు

-డా॥సుద్దాల అశోక్ తేజ

హైదరాబాద్, మార్చి 25 (నేటి నిజం ప్రతినిధి): మనిషిలో మార్పును తీసుకు రాగల రచనలే మంచి రచనలని ప్రసిద్ధ కవి జాతీయ ఉత్తమ సినీ గేయకవి పురస్కార గ్రహీత డా॥ సుద్దాల అశోక్‌తేజ అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్, ఉదయ సాహితీ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఆదివారం త్యాగరాయ గానసభలో ప్రముఖ కవి ఆచార్య కడారు వీరారెడ్డి రచించిన "లోకాలోకనం" వ్యాస సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది.

ఈ సందర్భంగా పుస్తకాన్ని ఆవిష్కరించిన డా॥ సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ... 21 శీర్షికలతో ఒక్కో వ్యాసం దేనికదే ప్రత్యేకంగా వున్నాయని సమాజంలో జరుగుతున్న వాస్తవాలు కళ్ళకు కట్టినట్టు రాశారని అన్నారు. ఈ వ్యాసాలు చదివిన వారికి వారి వారి లోపాలు కనిపిస్తాయని, ఆలోచనలను రేకెత్తిస్తాయని మార్పుకు దారి తీస్తాయని అన్నారు.




ప్రముఖ కవి ఆచార్య కడారు వీరారెడ్డి రచించిన "లోకాలోకనం" వ్యాస సంపుటి ఆవిష్కరణలో మౌనశ్రీ మల్లిక్, ఆచార్య మసన చెన్నప్ప, బైస దేవదాసు, డా॥ సుద్దాల అశోక్‌తేజ, రచయిత ఆచార్య కడారు వీరారెడ్డి, డా॥ వసంత, దాస్యం సేనాధిపతి, కిన్నెర రఘురాం, సుబ్బారావు.



కడారు వీరారెడ్డి దంపతులను సత్కరిస్తున్న సుద్దాల అశోక్ తేజ, ఆచార్య మసన చెన్నప్ప, బైస దేవదాసు, మౌనశ్రీ మల్లిక్, కిన్నెర రఘురాం, సుబ్బారావు.

ఎంతో అధ్యయనం వుంటేగాని ఇలాంటి రచనలు రాయలేరని, ఇలాంటి రచనలు అవసరమని వీరారెడ్డి సాహిత్యకృషిని అభినందించారు.సభాధ్యక్షుడు ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు దాస్యం సేనాధిపతి మాట్లా డుతు.. అనతి కాలంలోనే అనేక ప్రక్రి యల్లో అక్షరానికి పదును పెడుతున్నారని ఇప్పటి వరకు 15 గ్రంథాలను వెలువరించారని వివరించారు.

వీరారెడ్డిగారి ప్రతి రచనకు మొదటి పాఠకురాలు వారి శ్రీమతి డా॥ వసంత గారైతే, రెండవ పాఠకున్ని తానేనని, రచనా వ్యాసంగంలో పట్టు సాధించారని ప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య మసన చెన్నప్ప అన్నారు. బైస దేవదాసు మాట్లాడుతు.. సాహిత్య ప్రపంచంలో ఎదగడానికి వీరారెడ్డి గారికి దాస్యం సేనాధిపతి స్నేహం కొంత ఆసరా అయితే, డా॥ వసంత గారి సహకారంతో ప్రతి రచన ఆణిముత్యంలా వెలుగు చూసిందని అన్నారు.

ప్రముఖ కవి, టివి, సినీ గేయ కవి మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతు.. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥సినారె ఆశీస్సులు అందుకున్న ఆచార్య వీరారెడ్డి గారి రచనలు వెలుగులు ప్రసాదిస్తున్నాయని అన్నారు. మొదట కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురాం కడారు వీరారెడ్డి సాహిత్య పుస్తకాన్ని వివరించారు. చివరన సుబ్బారావు వందన సమర్పణ చేశారు.

## నువ్వా -నీ ఉనికీ

నాజూగ్గా అప్పుడే కుబుసం విడిచిన
స్వర్ణ సర్పంలా మెలికలు తిరుగుతూ
దట్టంగా అల్లుకున్న జనారణ్యం మధ్యన
అలసటే ఎరుగకుండా నర్తిస్తూ
పగలూ రాత్రీ తేడాలేకుండా వెన్నెల పచ్చికలు
అలవోకగా స్పర్శిస్తున్న
కన్నీటి సముద్రాలపైన మునివేళ్ళనానించి నడుస్తూ
ఇక్కడో అక్కడో అక్కడో
ఒకరిద్దరిని ఎంచుకు వెంటేసుకు
నడుస్తూనే ఉన్నావు కాళ్ళుంటే అరిగిపోయి ఉండేవి.
అందంగా పెంచుకున్న గులాబీ తోటమీద
సుతారంగా విశ్రమించి
అత్తరు సువాసనలు పంచే మత్తు ఆహ్లాదాన్ని
ఆస్వాదిస్తున్న ప్రపంచానికి
పాలిపోయిన మంచుకొసల సూది మొనలను గుచ్చి
జ్వరం కత్తిమొనలతో చీల్చిన గాయాలను
రాత్రీ పగలూ గోనెసంచుల్లా కుడుతూనే ఉంటావు
ఆ మత్తు మబ్బు తొలగిపోయే జాడే లేదు
వేలికొసలమంచు కరిగే దారీ లేదు
కళ్ళుపైకెత్తి చుట్టూ ఒకసారైనా చూపు సారించని
నీ కర్కశ కోమలత్వానికి ఏది ముగింపు?.
బొంగరం కొసపైన నిలిచి గిరగిరా తిరుగుతూ
భూగోళాన్ని చిటికెన వేలికొసన బొంగరం చేసుకు
కుక్కిన పేలై స్వరాన్ని మరచి, సత్తువను మరచి
సర్వం మరచి స్పృహనూ మరచిన సజీవ కళేబరాల
మూగ ఆర్తనాదాలను సొమ్ముచేసుకుంటూ
కులుకులు ప్రదర్శిస్తున్న కౌటిల్యపు లాలసకు రూపమై
ఏమిటా చిద్విలాసపు నవ్వుల హేల
ఎప్పటికా క్రూరప్రదర్శనకు తెరపడేది?.
కాషాయమూ నీలిసొగసులూ కలబోసుకున్నఏదో ఒక ఉదయాన
పగలో రాత్రో భ్రాంతో నిజమో తెలియని అపురూప క్షణాన
అటుఇటూ లోతుతెలియని అగాధాల మధ్య
జలతారు సిల్క్ తీగ పై ఒంటికాలి బొటనవేలి
గోరు కొసన నిలిచి
అటో ఇటో తెలియని సందిగ్ధం కొసల్లో
పొగమంచు ఊపిరులు పీల్చుకుంటూ
రేఖా చిత్రమై కదల్లేక పోతున్నప్పుడు
అప్పుడు కాని అర్ధం కాదు నీకు
గాజు కిటికీ అద్దం మీద
ఊపిరి మొలిపించే ఆవిరి చుక్కవని
నా కలల సాకారంలో
గింగరాలు కొడుతున్న
ముక్కలైన నీడవనీ.



-స్వాతీ శ్రీపాద
8297248988

## చిన్న ప్రపంచం

"తాతా?
నా వేలు
నీ కారుకంటే పెద్దది!".
అని చెప్పి ఆమె
తన చిన్న వేలును
తన కంటిముందు
అడ్డంగా పెట్టుకుంది.
రోడ్డుమీద నిలిచిన కారు
ఒక్క క్షణంలో మాయమైంది.
"చూడు ?
నా వేలే పెద్దది!".
ఆమె నవ్వులో
లెక్కల పుస్తకం లేదు,
నిర్ధారణ మాత్రమే ఉంది.
నేను,
అరవై అయిదేళ్ల అనుభవాన్ని
భుజాన వేసుకున్న తాత,
ఆమె చిన్న వేలి ముందర
ఒక్క క్షణం నిరుపయోగిగా మిగిలిపోయాను.
స్ట్రాను సబ్బు నీటిలో ముంచి
నెమ్మదిగా ఊదింది ఆమె.
గాలిలో రంగురంగుల గోళాలు
చిన్న ప్రపంచాల్లా తేలాయి.
"తాత,
వీటిని సగం బుడగగా మార్చగలవా?".
విద్య,
విజ్ఞానం,
అనుభవం ?
అన్నీ ఒక్కసారిగా
చేతులు ఎత్తేశాయి.
"చేయలేను?
పగిలిపోతాయి."
ఆమె బకెట్ దగ్గరికి పరుగెత్తి
నురగను చూపించింది ?.
"అవిగో చూడు ?
సగం బుడగలు!".
పూర్తి గోళాలు
పగిలి
సగం వలయాలుగా
నీటిమీద విశ్రమిస్తున్నాయి.
ఆమె నవ్వు
మతాబులా వెలిగింది.
నా లోపల మాత్రం
మరో బుడగ పగిలింది.
నేను తాతను ?
కాని ఆమె ముందు
మళ్లీ నేర్చుకుంటున్న
బాలుడిని.



-మువ్వా శ్రీనివాసరావు
సెల్: 9948099900

పుస్తక సమీక్ష

# సి. నారాయణరెడ్డి గారి అక్షర (య) వైభవం


ఒకరు తెలుగు సాహిత్య క్షీర సాగరాన మహామంధర పర్వతమై అమృతాన్ని అందించి, ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి గాంచిన విశ్వనరుడు. మరొకరు హిమ మన్నగ సమానుడై, గురువుకు తగిన శిష్యుడై, తన రచనా వైదుష్య మును ప్రపంచమే ప్రస్తుతింప గురు ప్రభను దశదిశల విస్తరింప చేయుటకు కంకణము కట్టిన కమనీయ కవి సార్వభౌముడు. అందరి చూపుకు అందనంత ఎదిగిన వాడు. వేద వ్యాసాదులు, పోతనామాత్యుల వంటి వారలు గజేంద్రమోక్ష ఐతిహ్యమున కరి పక్షము వహించి వాదించ వీరొక్కరే మకరి పక్షము వహించి అతి ప్రభావ పూరిత ముగా వాదించి, అందరిచే 'ఔన'నిపించుకున్న పుంభావ సరస్వతి. ఈ పుంభావ సరస్వతికి గురువు ఋణము తీర్చుకొనవలె ననిపించింది. ధన కనక వస్తు వాహనము లనందించి కాదు. పరలోక గతుడైన తన గురువు కివేవీ ఇచ్చగించవు. మరెలా సాధ్యమయ్యేను? తన మనోభీష్టము ఎటుల నెరవేరేను? గురువు ప్రసాదించిన విద్యా సంపదనే తిరిగి గురువున కందించిన ధన్యుడవ సంకల్పించినాడు.

ఆ శిష్యుడే ఆచార్య అను మాండ్ల భూమయ్య. ఆ కావ్యమే **"సి. నారాయణరెడ్డి కథా కావ్య సమాలోచనం".** ఈ గురు శిష్యు ల 'అప్పు సప్పు' వ్యవహారములో సాహితీ ప్రియులైన తెలుగు వారు లాభపడినారు. సి. నారాయణరెడ్డి గారి కథా గేయ కావ్యాలైన నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, విశ్వనాధ నాయుడు, ఋతు చక్రం గ్రంథాలపై తనదైన సహృదయ విమర్శ అనబడు పరా మర్శ సంభాషణాత్మక శైలి రూపమున తెలుగు వారు అందుకున్నారు. ఇదీ తెలుగు వారి లాభము!

కార్పొరేటు సంస్థలలో 'ఈక్విటీ షేరు' రూపాన పెటుట్బడి పెట్టిన సామాన్య వాటాదారులకు 'డివిడెండు' రూపాన వార్షిక ఆదాయానికి అదనంగా సంస్థలు 'బోనసు షేరు'లనందిస్తాయి. అట్లే భూమయ్యగారు 'ఉత్తర భాగము' అను అనుబంధ రూపాన ఉత్తర భాగంగా 108 పేజీలలో సినారె వైభవము వారి రచనలపై రచ యిత మాటలనే ఉటంకించటం సబబు.

నారాయణ రెడ్డి గారి ఒక కావ్యం పేరు **'నవ్వని పువ్వు'**, ఈ పేరు నాధారం చేసుకుని మొదటి అధ్యాయానికి **'నవ్విన పువ్వు'** అని పేరు పెట్టాను. కవిగా వారి జీవితం గొప్పగా సాగటం వల్ల పెట్టిన పేరిది.

రెండవ అధ్యాయంలో నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, విశ్వనాధ నాయడు కావ్యాల సంక్షిప్త పరిచయముంది. కవికి పేరు తెచ్చిన కావ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అధ్యాయానికి కర్పూర జలపాతమని పేరు పెట్టారు. మూడవ




ప్రతులకు:
అనుమాండ్ల భూమయ్య,
సెల్: 98970 73999

అధ్యాయం జ్ఞానగంగ. ఇందులో ఋతు చక్రము, మంటలు-మానవుడు, విశ్వంభర అనే మూడు కావ్యాల గురించి అంశాలున్నాయి... నాల్గవది పద్మదళాలు. ఇందులో నారాయణ రెడ్డిగారి వచన కవితా సంపుటాలను సంబంధించిన అం శాలున్నాయి..కవి పొందిన పద్మశ్రీ, పద్మభూషణ గౌరవ పురస్కారాలను దృష్టిలో పెట్టుకుని పెట్టిన పేరిది.

నారాయణరెడ్డి గారు సినీ గేయ కవిగా సుప్రసిద్ధులు. వారి ప్రముఖమైన కొన్ని గీతాలను పేర్కొంటు వ్రాసిన అధ్యాయం **'రస రమ్యగీతాలు'.. 'వచన వాహిని'** అధ్యాయంలో రెడ్డిగారు వ్రాసిన సిద్ధాంత గ్రంథం మొదలైన వచన రచనల గురించి వ్రాసాను.

ఈ 108 పేజీలకు, దేవతా స్తుతిలో అష్టోత్తరాలకుండే పూజ్యనీయ ప్రాముఖ్యత ఉంది. 27 నక్షత్రాలు.. ఒక్కో నక్షత్రానికి నాలుగు పాదాలు. 27×4= 108. ప్రతి మనిషి ఈ 108 పాదాలలో ఏదో ఒక దానిలో పుట్టి ఉంటాడు. కావున ఈ సంఖ్యకు ఉన్న ప్రాముఖ్యత భూమయ్యగారి ఈ సమాలోచనం కున్నది.

పూర్వ భాగము, పూర్వ భాగములోని 300 పేజీలు గురు శిష్య సంభాషణా రూపములో సాగుతుంది. సంభాషణా రూపానికో సౌలభ్యం ఉంది.

చదువుతున్న పాఠకుడు ఈ సంభాషణలో పాల్గొంటున్న అనుభూతి కలుగుతుంది.

పాఠకుని మననంలోని చొచ్చుకుపోవటం సులభమవుతుంది.

ఉత్తర భాగం అంతా 'మాత్రా చందస్సు'లో సాగుతుంది. ఈ ఛందస్సులో ప్రతీపాదంలో 10 మాత్రలు 5 మాత్రలుంటాయి. సంస్కృతీ ఛందస్సు అంటే అక్షరాలపై ఆధారపడి ఉంటే ఈ మాత్రా ఛందస్సు మాత్రలు (కాలం)పై ఆధారపడి ఉంటుంది.

పాడుకోవటానికి అనువుగా ఉంటూ, సాంప్రదాయ బద్ధమైన చందస్సు కంటే సులభంగా ప్రజలలోకి చొచ్చుకుపోతుంది. నిరక్షరాస్యులు సైతం సులువుగా పాడుకోవచ్చును. ఉదాహరణకు ఉత్తర భాగ ములోని నవ్విన పువ్వులో నారా యణరెడ్డి గారి సతీమణి గురించి వ్రాస్తూ-

**అడుగు లేడును కలిసి తనతో**
**నడచి వచ్చిన ప్రేమ మూర్తికి**
**నడకపోయిన వ్యాధి కెంతగ**
**అడలెనో కవి- మనసు కందదు.** (పే.322)

మరో చోట నారాయణ రెడ్డి గారి భార్యసుశీలగారి అంతరంగము.

**అతని కన్నుల వెలుగు నరయగ**
**హంసయై మది రెక్కవిప్పును** (పే.323)
**గొప్ప పద సౌందర్యము. పద లాలిత్యము**
**కనబరిచినాడు రచయిత.**
**అనుమాండ్ల గారి అద్వితీయ రచనా వైభవము-**

ఈ కావ్యాంకిత గ్రహీత పద్మభూషణ్ డా॥ కె.ఐ. వరప్రసా దరెడ్డిగారి మాటల్లోనే తెలుసుకుందాము.

"మధ్య తరగతి మంద హాసం, అక్షరాలగవాక్షాలు వంటి కవితా సంపుటులు చదివినప్పుడు నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు వంటి గేయ కావ్యాలు గ్రోలినప్పుడు పగలే వెన్నెల కురిపించిన సినీ రసరమ్య గీతాలు ఆస్వాదించినప్పుడు సినారె ఘనతకు హేతువు నాకు తెలియదు. వ్యాఖ్యానాలు ఉపన్యాసాలు విన్నప్పుడు ఈయన (సినారె) ప్రాచీనతకు ఆధునికతకు వారధి కాబోలు అనుకున్నాను.

నా బోటి భాషాభిమానులను తన వాణితో బాణితో ఆకట్టుకుని కట్టి పడవేయగలిగే శబ్దార్థ మాంత్రికుడనుకున్నాను.

ఇదుగో, ఇప్పుడు ఆచార్య భూమయ్యగారి పుస్తకం చదివితే ఆయన పట్ల అభిమానం ఎందుకు కలిగిందో అర్థమైంది. ఇన్నాళ్ళూ హృదయానికి తెలిసిన విషయాలు బుద్ధికి కూడా తెలిసాయి.

3-డి కళ్ళ జోడును గ్రంధ రూపంలో చేతికిచ్చారు ఆచార్య భూమయ్య గారు.. మన చేత వారి విశ్వరూప దర్శనం చేయించారు.

ఒక విమర్శ, ఒక సృజన, రెండు జతకూడిన గ్రంథమీ **'సి. నారాయణరెడ్డి కథా కావ్య సమాలోచనం'.** అవును. అక్షరాలా ఇది నిజం.



**- కూర చిదంబరం**
సెల్: 8639338675

# వంశీ ఉగాది పురస్కారాలు అపురూప కార్యక్రమం



నటుడు రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న డా॥కె.వి.రమణాచారి, వంశీ రామరాజు

హైదరాబాద్, మార్చి 25:ఏకకాలంలో ఒకే వేదికపై పన్నెండు గంటలు నిర్విరామ విభిన్న కళా ప్రదర్శన ఏర్పాటు చేసి విదేశాంధ్రులతో పాటు దేశంలో ప్రతిభావంతులైన తెలుగువారిని సత్కరించడం వంశీ చేస్తున్న అపురూప కార్యక్రమమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. వంశీ ఆర్ట్ థియేటర్స్ వంగూరి ఫౌండేషన్ ఆఫ్ ఆమెరికా, సాంస్కృతిక కళాసారధి సింగపూర్ సీల్‌వెల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గానసభలో 54వ వంశీ సీల్‌వెల్ ఉగాది సందర్భంగా 65 మందికి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పూర్వ సలహాదారు డా॥ కేవీ రమణాచారి మాట్లాడుతూ ధర్మ ప్రవర్తనతో నడిచే వారికి ప్రాభవం ఉంటుందని, కానీ పరాభవం ఉండదన్నారు. పురస్కారాలు అందుకున్న వారిలో నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం వీసీ సూర్య ధనుంజయ్, సినీ నటులు సంగీత, మంజు భార్గవి, చంద్రమోహన్, సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, పంచాంగకర్త బాచుపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి, దర్శకుడు రేలంగి నరసింహారావు, దూరదర్శన్ డైరెక్టర్ కామేశ్వరి, వ్యాఖ్యాత కృష్ణమోహన్, సంగీత కళాకారులు అయ్యగారి శ్యామసుందర్ దంపతులు, రచయిత్రి నాగపద్మిని, సుధామ యధుమోహన్ తదితరులతో పాటు అమెరికా, సింగపూర్, ఖతర్, సౌదీ అరెబియా, ఒమన్, యూఏఈ టెహరాన్, బ్రిటన్‌లో నివాసం ఉంటున్న 18 మంది తెలుగు ప్రముఖు లు ఉన్నారు. ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్‌కు నటశిఖరం బిరుదుతో సత్కరించారు. సుంకరపల్లి శైల పర్యవేక్షణలో వేగేశ్న వికలాంగ బాలబాలికలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సధామయి రాధిక వ్యాఖ్యానం చేశారు.

# కొత్తతరం కవులను ప్రోత్సహించడంలో కవి సంధ్య పాత్ర గొప్పది



ప్రముఖ కవి యార్లగడ్డ రాఘవేంద్ర రావును సన్మానిస్తున్న అతిథులు

హైదరాబాద్, మార్చి 25:కొత్తతరం కవులను ప్రోత్సహించడంలో పాత తరం కవుల స్ఫూర్తిని చాటి చెప్పడంలో కవి సంధ్య సంస్థ ఎంతో గొప్పపాత్ర నిర్వహిస్తున్నదని ప్రముఖ సాహితీవేత్త మంగారి రాజేందర్ (జింబో) అన్నరు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో ఆదివారం కవి సంధ్య సాహిత్య సాంస్కృతిక సంస్థ బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేందర్ మాట్లాడుతూ.. శిఖామని కవి సంధ్య పక్షాన తెలుగు సాహిత్యానికి అమూల్యమైన సేవ చేస్తున్నారన్నారు. సభలో కవి సంధ్య ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. కవి సంధ్య సుధామ కవిత్వం పోటీ విజేతలకు బహుమతి ప్రదానం, సత్కారం చేశారు. తెలుగులో యుద్ధ కవిత్వంపై ఆచార్య కోయి కోటేశ్వరరావు ప్రత్యేక ప్రసంగం చేశారు. అనంతరం ప్రముఖ కవి యార్లగడ్డ రాఘవేంద్ర రావును సత్కరించారు. సభకు కవి సంధ్య సంపాదకులు డాక్టర్ శిఖామణి అధ్యక్షత వహించగా డాక్టర్ సీతారామ్ ప్రారంభోపన్యాసం చేశారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా డా॥ ఏనుగు నరసింహారెడ్డి, సుధామ, శీలసుభద్రాదేవి, ఆచార్య జీవి రత్నాకర్, చల్ల రామఫణి, స్వామిరాజు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1728వ రోజు 'తరాల మధ్య అంతరం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'తరాల మధ్య అంతరం' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839

## పతనం

పెరిగిన మేధ
తరిగిన నైతికత
ఆలోచనల్లో వేగం
ఆచరణలో దూకుడు
స్వార్థం అవినీతితో
చిన్నినా పొట్ట శ్రీరామరక్ష.
మాట మంచి నడవడికి సమాధి
డబ్బు జులుం అహంతో వితండవాది
పొగరుబోతు పోట్లగిత్త
స్వేచ్ఛ సమానత్వం పేరుతో
బరితెగిస్తున్న యువత.
కట్టడిలేని కట్టుబాటు విడిచి
కట్టుబొట్టు జుట్టుతో
ఆడో మగో తెలీని
రోత విచిత్ర వేషాలు
షోవర్క్
మిధ్యాచారాలు
డాంబిక జబర్దస్తీలు.
రోబోలా మారిన
మనిషి మనసు
సంస్కృతి సంప్రదాయాలు పూజ్యం
వెర్రిపోకడలకే నైవేద్యం
అదుపులేని కుర్రకారు
పట్టించుకోని పెద్దలషికార్లు.
గంపెడుపిల్లలు
గూడులో
ఉమ్మడి కుటుంబాలు మాయం
ఎవరికి వారే యమునాతీరేలో
డబ్బుయావ
అసంతృప్తితో ఆలుమగలు
అమ్మా నాన్నల
వృద్ధుల ప్రేమ కరువై
దుర్వ్యసనాల్లో
ఆధునిక సంసారాలు.

-ఎ.రాజ్యశ్రీ

## కాలచక్రాన్ని కట్టడిచేయగలమా?

మార్పుకు మరోపేరు తరం
మనం "తరం" అన్నమాటలో
అంతరార్థం గ్రహిస్తే
తరానికి తరానికి మధ్య ఉన్న
భేదాలు మనల్నిబాధించవు.
నీకు ముందున్న తరం
ఆచారాల అలవాట్ల
సమాజ పరిస్థితుల
జ్ఞాపకాల పుస్తకం తిప్పిచూడు
కనపడతాయి
నీకు-నీ పూర్వీకుల తరానికి
మధ్య ఉన్నతేడా.
మీ నాన్నలు ఎరుగరు ప్యాంట్లు
అమ్మలు కట్టారు
ఎనిమిది మూరల చీరలు.
నీ తరం ధరించింది
ప్యాంటు
ఆరు మూరల చీరలు.
అలాంటిమార్పే
నీ తర్వాత తరం
ఆహ్వానించింది
వచ్చాయి మీటరు బట్టలు.
వ్యసనాలు
ఏ కాలాలలో లేవు?
యుద్ధాల గూర్చి
కుండబద్దలుకొట్టినట్టు
శ్రీ శ్రీ చెప్పలేదా.
తరాలు తప్పక మారాలి
మనిషిలోని జ్ఞాన ప్రభలు
విశ్వంభరకు వెలుగులు చూపడమే.
తరాల మార్పు
అడవి మనిషి
ఆధునికుడు కావడానికి
తరాల మార్పు శ్రీ రామ రక్ష
తరాల మార్పు
మనిషికి భగవంతుడు పెట్టిన భిక్ష.

-డా.సి.వసుంధర

## (అం)తరం

అదేంటో..!
ఎంతో వయసుండీ
ఎన్నో అనుభవాలతో పండీ
మంచీ చెడుల ఔపోసన పట్టీ
ఎందరికో దారి చూపి
వృద్ధాప్యంలోకొస్తే...
అందరూ సలహాలిచ్చేవారే!
పాతిక దాటని వారు సైతం
ఎలా మెదలాలో బుద్ధి చెప్పేవారే..!!.
తమ వేలితో అడుగులు వేసి
తమ పెంపకంలో ఎదిగి
తాము చెప్పిన మాటలే నేర్చి
"మీకేం తెలియదనీ"
"మీ జోక్యం తగ్గించుకోమనీ"
ఆంక్షలు పెడుతూపనికిరాని స్టోర్రూంలోని
వస్తువులా చూస్తుంటే...
నవ్వుకోవాలో!
ఒకతరానికి రెండో తరానికి
పెరిగిన అంతరమని సర్దుకుపోవాలో..!?
కాలం తెచ్చిన కొత్త మార్పని భావించాలో!
ప్రమేయం లేని వాటిని వదిలి
పెద్దరికం కాపాడుకోవాలో!.

-గుర్రాల వేంకటేశ్వర్లు

## సంతోషం-విషాదం

వంశాభివృద్ధి నదీ ప్రవాహం
కొత్తనీరు పాతనీటిని
నిలవనీయక తోసేస్తుంది
కొత్త తరం పాత తరాన్ని
నిలవనీయదు
పాత తరం నిలదొక్కుకుంది
ప్రయాసతో
కొత్త తరం
ఘర్షణ సంఘర్షణలు
అవే
తరాల మధ్య అంతరానికి
దారి తీస్తుంటాయి.
నాటక వేదికపై
పాత్ర ముగిసినంతనే
వేదిక దిగిపోయి
మరో పాత్రలకు అవకాశం ఇస్తేనే
నాటకం ముందుకు సాగుతుంది.
లేకుంటే
నాటకం రసాభాస
రక్తి కట్టదు.
మీ తరంలో
మీరు చేసిన దానిని
వీపుపై మోస్తుంటే
ఈ తరం ఆక్షేపణతో
మిమ్మల్ని ఉపేక్షిస్తుంది
ఏ తరం వారికి ఆ తరం
మంచిగా అనిపిస్తుంది
అందుకే
కాలమహిమకి తలవొగ్గి
ప్రక్కకు తప్పుకోవటమే ఉచితం.
నువ్వు ఆర్జించిన ఆస్తిపాస్తులు
అనుభవించడానికి ఈ తరం సిద్ధం
నువ్వు ఆశించినది ఆచరించాలనుకుంటే
నీ ప్రయాస వ్యర్థం.
అందుకే యువరాజుకి పట్టంకట్టి
వానప్రస్థాశ్రమాన్ని చూపాయి-
మన సనాతన ధర్మ శాస్త్రాలు.
అహం వీడి
వైరాగ్యాల తరాల మధ్య
అంతరాన్ని ఆనందించు.
లేకుంటే
అంతరాలే అంపశయ్యలై
నీ వృద్ధాప్యాన్ని బాధిస్తాయి.
గ్రహిస్తే సంతోషం
ఆగ్రహిస్తే విషాదం.

-రాజప్ప

## నాపచేను

మానవాళి మనుగడ
పునరుత్పత్తుల పుణ్యఫలం
సెలయేరుల ప్రవాహంలా
గలగల నడిచేది.
రాతియుగం నుండి
రాటుదేలుతూనే ఉంది
రక రకాల మార్పులతో
రక్తి కట్టిస్తూనే ఉంది.
సమూహాలు సంఘాలుగా
ఉమ్మడి కుటుంబాలుగా
ఉనికి చాటుకుని
పారిశ్రామిక పరుగులతో బోసిపోయి
ఒంటరి కుటుంబాలయ్యాయి.
సాంకేతికత పెరిగిన కొద్దీ
సహనం నశిస్తూ
ఎవరికీ వారే యమునా తీరే చందంగా
ఒంటరి పోరాటాల బతుకైంది.
అనుభవాల ఒడిలో అక్షరాలు
దిద్దుకొనక
సుద్దులు చేదై
మాటవినని మారాములతో
మర్కట ఛాయల్లో
మసులుకోవడం.
నాడు
అమ్మానాన్నల మాట విన్నాం
నేడు పిల్లల మాటే వేదవాక్కై
మసులుకుంటున్నాం
రెండు తరాల మధ్య నలిగిన
నాపచేనులం మనం ...

-నగునూరి రాజన్న


## ఎవరికి వారే యమునా తీరే

నాటి మహిళ
వంటింటి కుందేలుగా
మీ పాదాల కడ
ఇంత చోటు ఇవ్వమనేది!
అమాయక, శక్తి హీన
అబల ఆనాడు!
నాడు పెద్దల సుద్దుల
హద్దులు దాటక
సుఖ సంతోషాలతో
జనమంతా!
ప్రతివారూ
ఆడా మగా కష్టించే వారే!
చెమటోడ్చిన ఫలంగా
నిత్య ఆరోగ్యం!
కమీజు, ధోతీతో మగవారు
చీరా రవికతో నిండుగా
స్త్రీలు ఆనాడు!
తరం మారింది
అంతరాలు పెరిగాయి!
స్వార్థం పెరిగి
వితండవాదం ముదిరి
స్వేచ్ఛ పేరుతో బరితెగిస్తున్న యువత!
ఆడవారు అర్ధనగ్నదుస్తుల ధారణ
యూట్యూబ్ లో చూసి
వంటలు చేసే ఇల్లాళ్లు
ఆ వంట ఒంట పట్టక
హోటళ్ళకు పోయే మగాళ్లు!
రోజూ ఆన్లైన్లో ఆర్డర్లతో తిండి!
శారీరక శ్రమ లేక ఉబకాయం!
వ్యాయామ యోగాలకు
దూరం వీళ్లు!
రోగాలు రొష్టులతో సతమతం
ఆలుమగలు
పెళ్లయిన కొన్నాళ్లకే విడాకులు!
సహజీవనమంటూ
శీలం వీధిపాలు!
వృద్ధులు మందలిస్తే
కసురుకుని తరిమెయ్యడం!
నచ్చినా నచ్చకపోయినా
సర్దుకు పోతే సరి!
లేదంటే
వృద్ధుల భవిత అధోగతే!!

-కోలా సత్యనారాయణ

# తాత్త్విక సత్యాలతో బ్రహ్మసారము

పుస్తక సమీక్ష



ప్రతులకు: 5-6, బి.సి. బాలుర హాస్టల్ ఎదురుగా, మల్లికార్జున నగర్, అలియాబాద్ షామీర్‌పేట(మం) రంగారెడ్డి జిల్లా.

మనసుకందియు రాస్తి మాణిక్యమిది కాదు, మద్గురుడు చెప్పిన మంత్రమయ్య, మంత్రవాక్యములోని మర్మంబు నేరాస్తి అన్న విన్నపంతో మొదలిడిన ఈ 'బ్రహ్మసారము' కృతిలో ఆధ్యాత్మిక వినయంతో చేసిన ఆత్మ నివేదనలు ఎన్నో వున్నాయి. ఎక్కువగా కందం, సీసం, తేటగీతిలోనే గాక ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, మత్తేభం వంటి వృత్తాలలో మనకు తత్వ సారాంశాన్ని నైపుణ్యంగా అందించారు. చందోబద్ధంగా కవితలను సరళమైన భాషలో అందించడం వీరి ప్రత్యేకంగా చెప్పుకోవచ్చును. ఈ పుడమికి పలు విధాలుగా బోధజేసిన మహనీయులు ఆదిశంకరుడు (అద్వైంత సిద్ధాంతి), మధ్వాచార్యుండు (ద్వైతము) రామానుజ స్వామి (విశిష్ట ద్వైతము), యోగి వేమన (వెలది విజ్ఞానంబు) పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి (కాలజ్ఞానం), వంటి మహనీయులు ఈ జనుల వెతలు బాపును అంటూనే వారి పాదాల శరణు చేశారు. భ్రమలన్నియు ఈ జగమున శ్రమలన్నియు కలగుజేయు, ఫలితములు ఆశించక నీవు ఇలలో పనులన్ని జేయుము, మతములు వేరైనను సరే, హితుడు ఆ ఆత్మేశ్వరుండే, హితమతి ఒక్కరే కావున మతి తప్పి మతములను బడి గతి దప్పి తిరగరాదు కడ తేరుటకై అంటూ రాసుకొచ్చారు. పాపం ఎప్పుడూ ఇంట శాపమై వెంటాడు, కోపం ఎప్పుడూ ఇట కొంపముంచు, మధుర వాక్కులు బల్కి మనుషుల మనసును ఆనందపరిచిన అదియే ఆత్మబ్రహ్మ అంటూ జ్ఞాన బోధగావించారు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలచే ఎవరు ఆనందాన్ని ఎరుగగలరో అట్టి స్థితి ప్రజ్ఞానము అదియే బ్రహ్మ అన్న ఈ బృంగాచల పరిపక్వం చెందిన ఆత్మ జ్ఞాన భావాలకు జోహార్లు. ఇక కర్మ సిద్ధాంతం గురించి కూడా విపులంగా వివరించారు మరో సీసంలో. మనసునందు మాలిన్యము లుండరాదనీ, అనరాని మాటలు అనరాదనియూ, చేయరాని పనులు చేయరాదనియూ, ధర్మ మార్గము వీడి దార్త రాష్ట్రుడై మెలగరాదనీ, ఆ విధంగా వుంటే కర్మ విడువదనీ, మరల జన్మ నెత్తుతారనీ, రచయిత జీవన గమనాన్ని నిర్దేశించారు. మంచి చెడు విచక్షణ అవసరం అని చెప్పారు. రాముడు నీవై వుండగ, రాతిని మొక్కుతా వెందుకు, ఆ దేముని తెల్సుకోవాలంటే గురువును ఆశ్రయించమంటారు వంగరివారు. భ్రమలను తొలగించుకుని, వాస్తవ ప్రపంచంలోనే జీవిస్తూ, భక్తి భావంతో ఆ భగవంతుని ఆశ్రయించిన వారికి పరమార్థం ఇట్టే గోచరిస్తుందన్న నారాయణాచార్యుల వారి ప్రయత్నం అభినందనీయం. వీరి పద్యాలన్నీ సరళంగా వుండి సాధారణ పాఠకులకూ స్ఫూర్తినిస్తాయి. భృంగాచల వంగరి నారాయణాచార్యులవారు ధన్యులు.



- డా॥ పులివర్తి కృష్ణమూర్తి
సెల్:9949092761

## ప్రపంచ శాంతి

ప్రపంచ దేశాల మధ్య
శత్రుత్వం పెరిగిపాయె
శాంతి సామరస్యాలూ
అడుగంటెను రోజు! రోజు!.
ఒకరిమీద మరిఒక్కరు
ఆధిక్యత కోసమంటు
స్నేహభావమింత లేక
ప్రవర్తించె తీరు,! నేడు
విస్మయాన్ని కలిగిస్తది!.
అణ్వస్త్రపు ఆయుధాలు
మాకు రక్ష అంటు ఎపుడు
నీల్గడాలు ఆపివేసి
మిత్రత్వం పెంచుకొండి!
మానవ మేధస్సు ఎదిగి
సమాజాన్ని రక్షించితె
గొప్పగాని! అణ్వస్త్రం
ప్రయోగించి భూగోళం
బుగ్గిచేస్తె గొప్పగాదు!.
మనుషులంత బూడిదయితె
నేల అంత విషం గక్కె
రీతి అయితె మనిషి చర్య
తిరోగమనమే కాదా!.
పుట్టిన పుట్టుక ధన్యత
పొందడమెంతో ముఖ్యం!
కోట్లకు పడగలెత్తడం
కాదు సుమా! కోట్ల మంది
ఆకలి కేకలను తీర్చి
మహోన్నతుడిగ మారవోయ్!




-డా॥ దాశరథుల నర్సయ్య
9390919100

## మితం

సౌక్యమ్ బంగారం
నగ గా తీర్చేందుకు
దాతు కలపాల్సిందే
మితం అయితేనే
నగా నట్రా రాణిస్తుంది
అధికమయితే కేటు
అమ్ముకొంటే తరుగు



-పత్తి శివప్రసాద్
9440001224



# బాలగేయాలు-భక్తిప్రబోధం

## నిజమైన భక్తి అంటే ఏమిటో చెప్పే పరిశోధన!

తెలుగు బాల సాహిత్యంలోని విషయాలపై విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు చేసిన వారు చాలా తక్కువ.. తెలంగాణ ప్రాంతంలో బాల సాహిత్యాన్ని గురించి పి.హెచ్.డిలు చేసినవారు మరీ తక్కువ. ఈ నేపథ్యం లో మిత్రుడు డా॥ గౌరవరాజు సతీష్‌కుమార్ బాల సాహిత్యంలోని ఒక ముఖ్యమైన విషయంపై పరిశోధన చేయడం, దాన్ని ఇలా పుస్తక రూపంలో అందరికీ అందుబాటులోకి తేవడం పిల్లల ప్రేమికులూ, బాల సాహిత్యాభి మానులూ అందరూ ఆహ్వానించే మంచి విషయం. "భక్తి" గురించి మాట్లా డటానికి ఎంతో ఇబ్బందికర పరిస్థితులు ఈనాడు మన చుట్టూ ఉన్నాయి. కానీ, నిజ మైన "భక్తి" గురించి మాట్లాడాల్సిన అవసరం ఇప్పుడు తప్పకుండా ఉంది. మిత్రులు గౌరవరాజు సతీస్ కుమార్ తన పరిశోధనలో భక్తి గురించి కొన్ని విషయాలను వివరించారు.

"భగవంతుడు కంటికి కనిపించకున్నా, అందరిలోనూ ఉన్నాడనే భావమే భక్తికి బీజం. అందుకే సమాజంలోని కుల, మత, వర్గ, వైషమ్య భావనను రూపుమాపి, సమభావంతో "ఆత్మవత్ సర్వభూతాని" అనే దృష్టితో జీవితాన్ని దర్శించగల శక్తి ఈ "భక్తి"కి మాత్రమే ఉంది. అంటే వైయుక్తికంగా ఉన్న కుల, మత, వర్గ, లింగ, ఆర్థిక, సామాజిక విభేదాలు మరచిపోయి, అందరిలోనూ దేవుణ్ణి చూడగలగడమే భక్తి మార్గం." అని నిజమైన భక్తి అంటే ఏమిటో వారు తన పరిశోధన వ్యాసంలో వివరించారు.

ప్రకృతి ఒడిలో అడవుల్లో మానవులు జీవించిన కాలంలో వారికి తమ చుట్టూ ప్రకృతిలో జరుగుతున్న విషయాలు ఆశ్చర్యంగా, భయంగొల్పే విధంగా, అనూహ్యం గా అనిపించాయి. భయాన్నీ, భక్తినీ కలిగించాయి. వాటికి భయపడ్డారు. గౌరవించారు. ప్రకృతి తత్వానికి ముగ్ధులైయ్యారు. దాన్ని అర్థం చేసుకునే పరిస్థితి అప్పుడు వారికి లేదు ఐనా వారు దాన్ని పరిశీలించారు. ఏమిటి? ఎందుకు? అనే ప్రశ్నలకు జవాబులు ఊహించే ప్రయత్నం చేశారు. జిజ్ఞాస పెరిగినకొద్దీ రకరకాల కల్పనలు చేసుకున్నారు. ఈ ప్రకృతిలో తమ ఊహకు అందని మహత్తర మైన మానవాతీత శక్తులున్నాయని భావించారు. అలా ప్రకృతి ఆరాధనలోంచి భగవత్ సృష్టి చేసుకున్నారు. ఆ దేవతలను ప్రసన్నం చేసుకునే క్రతువులు ఏర్పరచుకున్నారు.

క్రమంగా మనుషులతో బాటే, వ్యవస్థలతో బాటే అది మతంగా, వ్యాపారంగా, రాజకీయంగా, మూఢ విశ్వాసాలుగా మారింది. కొందరికి దోపిడీ కేంద్రంగా, ఆయుధంగా ఉపయోగపడింది. ఘర్షణలకూ, పోరాటా లకూ, యుద్ధాలకూ, రక్తపాతాలకీ, మూఢత్వానికీ దారితీసింది. ఇప్పుడు భక్తికి అర్థం పూర్తిగా మారిపోయింది. ఇలాంటి పరిస్థితులలో భక్తిలో ఉండిన ఓ మంచి కోణాన్ని గుర్తుచేస్తూ, అలాంటి భక్తి భావన పిల్లలకు అవసరమని భావించి, తెలుగు వాళ్ళు సృష్టించిన బాల సాహిత్యంలో, పిల్లలకు భక్తిని బోధిస్తూ వచ్చిన అన్ని ప్రక్రియల్లోని వివిధ రచనల్ని తన పరిశోధనలో సమగ్రంగా పరిశీలించారు.

డా॥ గౌరవరాజు సతీష్‌కుమార్ మూడు దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయులుగా పని చేశారు. వేలాదిమంది పిల్లలతో సన్నిహితంగా గడిపారు. వారి గురించి ఎంతో అవగాహనను పెంచుకున్నారు. పిల్లలకోసం ఎన్నో పుస్తకాలు రచించారు. ఇప్పటికీ అవిశ్రాంతంగా బాలసాహిత్యాన్ని సృజిస్తూనే ఉన్నారు. ఆయనకు ఇలా బాలలతోనూ, బాలసాహిత్యంతోనూ విడదీయరాని ఆత్మీయ బంధం ఉంది. కనుకనే ఆయన తన పరిశోధనను బాలసాహిత్యంలో ఎంచుకొని, దాన్ని ఎంతో ప్రేమతో, భక్తి శ్రద్ధలతో చేసినట్టు అర్థమౌ తుంది.

గౌరవరాజు సతీష్‌కుమార్ ఈ పరిశోధనా వ్యాసంలో బాల్యం అంటే ఏమిటని, బాల సాహిత్యం పూర్వాపరాలు, దాని చరిత్ర ఏమిటని ఎంతో వివరంగా చర్చించారు. అలాగే మౌఖికంగానూ, లిఖితరూపంలోనూ వచ్చిన సమస్త బాలసాహిత్యంలో ఎన్నో ప్రక్రియల్లో వచ్చిన భక్తిని పరిశీలించారు. వెతికి వెలికి తీసి విశ్లేషించారు.


భక్తి అంటే కేవలం దైవ సంబంధమైనది మాత్రమే కాదని, అది మాతృ భక్తి, పితృభక్తి, గురుభక్తి, దేశభక్తి వంటి అనేక రూపాల్లో ఉంటుందని విశ్లేషించారు. వివరించారు. "పూజ్య వస్తువుపై ఉండే ప్రేమకు భక్తి అని పేరు. ప్రేమకు భక్తికి తేడాలేదు." అని భక్తిని విశాలార్థంలో చూపించారు. అలాగే చరిత్రలో జరిగిన భక్తి ఉద్యమాల గురించి వారు ఇలా అంటారు.

"భక్తి ఉద్యమం ప్రజలను సమైక్య పరిచి, సమాజాన్ని ఉన్నత మార్గాల వైపుకు మళ్ళించింది. అలా అని కేవలం మోక్ష సాధనకే పరిమితం కాలేదు. చైతన్యవంతులను చేసేందుకు ఈ భక్తి ఉద్యమం ఒక ఉపకరణమయ్యింది కూడా. విదేశీయుల దురాక్రమణలను దోపిడీ దారులను ఎదిరించి నిలిచేందుకు జాతిని సమైక్యంగా నిలిపి, సమా జాన్ని జాగృతం చేయడంతో బాటు అనేక సంస్కరణలకు కూడా దారితీసింది..." అలాగే, "భక్తి రసపోషణలో దేవుని స్థానంలో "దేశం" నిలబడింది." అన్నారు. ఇంకా "ఉత్తర భారతంలో జరిగిన భక్తి ఉద్యమాలలో కబీరు, షేక్ మహ్మద్, షేక్ ఇబ్రహీం మొదలైనవారు, దక్షిణ భారతంలో తుకారాం, రైదాస్, వీరబ్రహ్మం, సిద్దప్ప, మాణిక్యప్రభు, షిర్డీ సాయిబాబా, సోమన్న, బసవన్న, వేమన్న లాంటి వారు మత సమైక్యతకై పాడు పడ్డారు"అని చెప్పారు.

గౌరవరాజు సతీష్‌కుమార్ ఈ పరిశోధనా వ్యాసంలో పైన పేర్కొన్న అన్ని రకాల భక్తినీ పిల్లలకు అందించిన బాల సాహిత్యా న్నంతా జల్లెడపట్టి చూశారు. మౌఖిక, జానపద, ప్రాచీన, ఆధునిక సాహిత్యాల నుంచి గనులను తవ్వి, బాలలకు సంబంధించిన విషయాలను వెతికి వెలికితీసి, కూలం కషంగా పరిశీలించారు. వీటిలో మూడు, నాలుగు తరాల కిందటి బాల గేయాలు, నాటికలు వంటివి కూడా ఉండడం ఎంతో ఆనందం కలిగిస్తుంది.

వీరు తమ పరిశోధనలో బాల సాహిత్య ప్రక్రియలైన గేయాలు, సాధారణ గేయాలు, ముక్తక గేయాలు, కథనాత్మక గేయాలు, పద్యాలు, ముక్తక పద్యాలు, కథా పద్యాలు, శతకాలు, ఖండకావ్యాలు, కథ, నవల, నాటిక, బుర్రకథ, పొడుపుకథ, జీవిత చరిత్రలు, దేశ చరిత్రలు, విజ్ఞాన సర్వస్వాలు, విజ్ఞాన శాస్త్రా లు, సాంఘిక శాస్త్రాలు, వ్యంగ్య చిత్రాలు (కార్టున్లు), సుచిత్ర కథలు (కామిక్స్), సమా చార ప్రసార రంగం, ప్రసార మాధ్యమాలు ఇలా ఇవన్నీ వీరు ఈ పరిశోధన సందర్భంగా పరిశీలించారు. ఇలా వీరి పరిశోధన, పరిశీలన బహుళ విస్తృతంగా జరిగింది.

తెలుగులో బాలగేయాల పుట్టుకను, వికాసాన్ని, భక్తి ప్రబోధంలోని ఇతివృత్త వైవిధ్యాన్ని ప్రదర్శించి చూపడానికి ప్రయత్నించారు. "సంస్కారం భక్తిభావ సంజనితం." అని "ఆ భక్తిభావనను పిల్లల్లో ప్రోది చేయడానికి భక్తిని ప్రబోధిస్తున్న అనేక బాలగేయాలున్నాయి." అని వారు చూపించి, విశ్లేషిస్తూ వివరించారు. ఈ పరిశోధనలో కేవలం దేవభక్తి ప్రబోధం మాత్రమే కాకుండా వివిధ స్వరూపాల్లో ఉన్న భక్తిప్రబోధాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని, ఆ నేపథ్యంలోనే బాల గేయాలను వీరు దైవభక్తి, మాతృభక్తి, పితృభక్తి, గురుభక్తి, భారతీయ సంస్కృతి పట్ల భక్తి ప్రబోధం, తెలుగుదనం పట్ల భక్తిప్రబోధం, దేశభక్తి ప్రబోధం, ఇతరాలు అనే విభాగాల్లో పరిశీలించారు.







ప్రతులకు:
ఇ.నెం.5-2-174
ఫ్లాట్ నెం.24, రోడ్ నెం.1,
గాంధీనగర్ సౌత్, వనస్థలిపురం
హైదరాబాద్-500 070
సెల్: 9866757278

**డా॥ గౌరవరాజు సతీష్‌కుమార్ రచన "బాలగేయాలు-భక్తి ప్రబోధం" పుస్తకానికి వి.ఆర్.శర్మ రాసిన ముందు మాట...**

బాల్యం నుంచి తల్లుల పిల్లల్ని ప్రయోజకులుగా, మంచి మనుషులుగా, తీర్చి దిద్దడానికి తమ గేయాలు, పాటల ద్వారా ఎలా ప్రయత్నించారో చెప్పడానికి అనేక ఉదాహరణలను వీరు చూపించారు. ఇక్కడ వాటిలోని ఒకటి రెండు మాత్రమే నేను ఎత్తి చూపిస్తున్నాను.

మనవారు పసివారి జీవన అవసరాలకు సంబంధించిన ప్రతి విషయాన్ని బాలగేయాల్లో పొందుపరచడం చూడొచ్చు.

**-"జో అచ్యుతానంద జోజో ముకుందా.."**
**- "రామాలాలీ మేఘశ్యామా లాలీ.."**
**-"లాలనుచు పాడరే బాలయేసునకూ..."**
**-"తారంగం తారంగం తాండవ కృష్ణా తారంగం..."**
**-"తప్పెట్లోయ్ తాళాలోయ్-దేవునిగుళ్ళో బాజాలోయ్.."**
**-"బాజాలతో వచ్చే పార్వతీ దేవీ-పార్వతీ దేవికీ జేజేలు పెట్టు..."**
**-"జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం.."**
**-"ఏనుగు ఏనుగు నల్లన- ఏనుగు కొమ్ములు తెల్లన..."**

ఇలా పాడుతూ ఆడిస్తూ పిల్లలకు స్వచ్ఛమైన భక్తి భావనను నూరిపోసిన అనేక గేయాలను మనకు వీరు వెతికి చూపించారు. పరిశీలించారు, విశ్లేషించారు. వీటిలో త్యాగయ్య, అన్నమయ్య వంటివారు రాసిన అజరామరమైన బాల భక్తిగేయాలు కూడా ఉన్నాయి. కనిపించే ప్రకృతి, కనిపించని భగవంతుడు ఆ భక్తికి కేంద్రాలయ్యాయి.

బాలగేయాల్లో మనకు సాయంచేసేవీ, కాపాడేవీ, నడిపించేవీ అన్నీ భగవత్ స్వరూపాలే. మన చుట్టూ వున్న చీకట్లను తొలగించి, వెలుగులు పంచే దీపాలకు సంబంధించిన గేయాలు ఉన్నాయి. వీటిలో కొన్ని మా బాల్యంలో పాడుకున్నవి కూడా కనిపించాయి.

**-"సంజె దీవికి చక్కని జేజే-గుడి దీపానికి గుప్పెడు జేజే.."**
**-"దీపం జ్యోతీ పరబ్రహ్మం..."** వంటివి కొన్ని ఉన్నాయి. ఇంకా జీవితానికే వెలుగులిచ్చే
**-"తల్లికి తండ్రికి జేజేలు-పంతులు గారికి జేజేలు**
**చదువుల తల్లికి జేజేలు-జగముల తండ్రికి జేజేలు..."** వంటివీ ఉన్నాయి. అలాగే
**-"అంతా ఒక్కటే-జనులంతా ఒక్కటే**
**మతమేదైనా కులమేదైనా, మానవులందరు ఒకటే**
**హరిజనులైనా గిరిజనులైనా, అందరు మన సోదరులే**
**ముస్లిములైన క్రైస్తవులైనా అందరు మన బంధువులే**
**విశ్వ మానవులు ఒకే కుటుంబం వివిధ జాతులు పుష్ప కదంబం.."**

మనం చూడాలి కానీ, ఇలా భక్తి పేరుతో చిన్నతనం నుంచి బాలసాహితీవేత్తలు బోధిస్తూనే ఉన్నారు.

పుడమికి ప్రాణం ప్రసాదించే ప్రత్యక్ష దైవం సూర్యుడు. సూర్యోదయం నుంచి మొదలుకొని ఆ సూర్యుణ్ణి భక్తితో అద్భుతంగా వర్ణిస్తున్న బాలగేయం ఒకటి చూడండి-

**"పుట్టేటి భానుడా పుష్యరాగపు చాయ-శ్రీ సూర్యనారాయణా!**
**పుష్యరాగము మీద పొంగు బంగరు చాయ-శ్రీ సూర్యనారాయణా!...** ఇలా కొనసాగే ఈ గేయంలో.

**"జామెక్కి భానుడా.. జాజిపూవుల చాయ**
**జాజి పూవుల మీద-సంపెంగ పువు చాయ**
**మధ్యాహ్న భానుడా- మల్లెపూవుల చాయ**
**మల్లెపూవుల మీద-మంచి వజ్రపు చాయ**
**ముజ్జాము భానుదా- మునగ పూవుల చాయ**
**మునగ పూవుల మీద-ముత్యాలపొడి చాయ**
**క్రుంకేటి భానుడా- గుమ్మడీ పువు చాయ**
**గుమ్మడీ పువు మీద- కుంకుమ పువు చాయ**
**ఆయురారోగ్యాములు-ఐశ్వర్యముల నిమ్ము!!.."**

ఎంత అద్భుతమైన గేయం ఇది! గేయం నిండా పూల ప్రకృతి, పరిమళం పిల్లల మనసును ఎంతో పరిమళింపజేస్తుంది. ప్రకృతి పట్లా, ప్రకృతి శకుత్లపట్లా ఆసక్తి, శ్రద్ధా, గౌరవం. ప్రేమా పిల్లలలో పూయించే గేయం ఇది.

అలాగే... ప్రకృతి శక్తుల్లో ఒకటై ప్రాణాధారమైన వర్షాన్ని కూడా దేవుడిగానే భావించి ప్రార్థించే ఈ గేయం చూడండి-

**"వానల్లు కురవాలి వానదేవుడా**
**వరిచేలు పండాలి వానదేవుడా**
**నల్లని మేఘాలు వానదేవుడా**
**చల్లగా కురవాలి వానదేవుడా**
**పచ్చనీ చేలన్నీ వానదేవుడా**
**పంటలూ పండాలి వానదేవుడా**
**మా వూరి చెరువంత వానదేవుడా**
**ముంచెత్తి పోవాలి వానదేవుడా..!**

ఇలా ప్రకృతినే భతవంతుడిగా భావించి ప్రార్థించడం, ఆ ప్రార్థనల్లోనూ తనకోసమే కాకుండా అందరికోసం, ఊరికోసం ప్రార్థించడం, అదికూడా మోక్షం కోసం కాకుండా మంచి జీవితం కోసం ప్రార్థించడం గొప్ప విషయం!

నిజమైన భక్తి ఇదేనని బాల్యంలోనే పెద్దలు వాళ్ళకు ఇలా బాలసాహిత్యం ద్వారా బోధించే ప్రయత్నం చేశారు. అలాంటివన్నీ మళ్ళీ తన పరిశోధనతో సతీష్‌గారు మన ముందుకు తెచ్చే కృషిచేయడం ఈనాటి పరిస్థితులలో ఎంతో అవసరమైన విషయం.

ప్రకృతి పట్లా, సాటి మనుషుల పట్లా, ఊరిపట్లా, దేశంపట్లా, మంచీ మానవత్వం పట్ల, సర్వజన మానవత్వం పట్లా ఇలాంటి మరెన్నో మంచి విషయాల పట్లా "భక్తి" అనే ప్రేమను బాలల్లో ప్రోదిచేసేలా ప్రబోధించే బాలగేయాలను తన 'బాలగేయాలు- భక్తి ప్రబోధం' అనే తన పరిశోధనా గ్రంథం ద్వారా వెలుగులోకి తెచ్చి అందించిన మిత్రుడు గౌరవరాజు సతీష్ కుమార్ కు హృదయ పూర్వక అభినందనలు.



-వి.ఆర్.శర్మ
సెల్:09177887749

# కీర్తికేతనం-ఆర్తి నికేతనం అజరామరమై నిలిచే కావ్యం 'ఆంధ్రగీతి'!

'ఆంధ్రగీతి' వెలువడుతున్న సందర్భం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నది. చారిత్రాత్మకమైనది. నిత్య సంస్మరణీయమైనది కూడా! అది మండలి వెంకటకృష్ణారావు శతజయంతి జ్ఞప్తి.

సామాన్యులకై అసామాన్యుడుగా జీవించి అచ్చంగా కీర్తిమంతులైనవారు మండలివారు. పోతన చెప్పిన **"శారద నీర దేందు.."** పద్యంలో ఉపమించిన సంపూర్ణ ధవళత్వ చిహ్నాలన్నీ ఆ కీర్తిధారికి వర్తిస్తాయి. అసలైన తెలుగు సంస్కృతిని అణువణువునా జీర్ణించుకొని, ఆచరణ సాధ్యం చేసి చూపిన ధన్యజీవివారు. తెలుగువారికి వారు చేసిన బహువిధమైన సేవ స్ఫూర్తి మంతమే కాదు, అనుదిన వందనీయం! ఆ సేవా సంక్రాంత ఋణం తీర్చు కోగలిగేది కాదు.

శ్రీ బుద్ధప్రసాదు మండలి వెంకట కృష్ణారావుగారి బహుసార్వ్యయుత సద్గుణనిధిని వారసత్వంగా అందుకున్న భాగ్యశాలి. ఒక్కటేమాట... అడుగుజాడ తండ్రిది. నడత. నడక కుమారునిది. వీరి చలనం, గమనం, పయనం తెలుగు భాషాసాహితీ సంస్కృతులు చేసుకున్న పుణ్యఫలం. వీరు గౌరవాధ్య క్షులుగా, దిక్సూచిగా మా గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షులుగా, మా పూర్ణచందు ప్రధాన కార్యదర్శిగా నిలిచిన కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రచురణగాథ 'ఆంధ్రగీతి' వెలువడుతూ వుండడటం ఆ సంస్థకు గౌరవప్రదం, ఆ సంస్థతో నిత్య సంబంధ బాంధవ్యం కలిగిన నా వంటి ప్రతి ఒక్క సాహితీ పరునికీ ఆనందదాయకం.

'ఆంధ్రగీతి। కవి డా॥జి.వి .పూర్ణచందు వృత్తిరీత్యా ఆయుర్వేదవైద్యుడు. ప్రవృత్తిరీత్యా శతాధిక గ్రంథకర్త. సాహితీపరుడుగా నిత్య విద్యార్థి. అధ్యయనం, పరిశీలన, పరిశోధన, పరిశ్రమ, ప్రయోగం అతని చేత అనితరసాధ్యమైన సాహితీ విజయాల్ని సాధింపజేశాయి.

14 ఏళ్లకే కలం పట్టాడు. 21వ ఏటనే **'అమలిన శృంగారం'** శాస్త్ర గ్రంథం రాశాడు. ఆ తరువాత అనేక వైజ్ఞానిక రచనలు చేశాడు. నవలాకారుడుగా **'నభూతో' పరిశోధనలుగా 'సప్తసింధు', 'తెలుగుధీర'**, నవలల్ని వెలువరించాడు. కవిగా, సోమసుందర్ వంటి పెద్దలు అభినందించిన **'కాంతి స్వప్న'** దీర్ఘ కవితని 1990ల్లోనే అందించాడు. ప్రయోగశీలిగా తన **'ముక్కాలు'** కవిత్వాన్ని ఐదు భాషల్లోకి అనువాదంగా తెచ్చాడు. సాహిత్య విమర్శకునిగా **'శ్రీగీత గోవిందం', 'పద్యంలో మనం', 'పద్యానుభవం', 'పద్యరాగాలు', 'రామాయణంలో విశేషాలు'** వంటి గ్రంథాల్నీ, చారిత్రక రచనాధురీణుడిగా 'బుద్ధదేవుని కథ', కృష్ణాతీరం-మరోచూపు','అలనాటి పట్టణాలు', 'బ్రిటీష్ యుగం' వెలువరించాడు. అనేకమంది మహనీయుల జీవితచరిత్రలు వ్రాశాడు. అప్పయ్యదీక్షితుల జీవితచరిత్ర అద్భుత పరిశోధన.

కాగా, భాషావరిశోధకునిగా పూర్ణచందు అద్వితీయుడైనాడు. **'తెలుగేప్రాచీనం', 'నైలు నుండి కృష్ణదాకా', 'తెలుగులో అతిథిపదాలు', 'సొంపైన తెలుగు'** వంటివి అతడు మాత్రమే రాయగలిగినవిగా ప్రసిద్ధి పొందాయి. తెలుగు వారికి అతని అమూల్యమైన కానుక 'ఆహారవేదం', అలాగే, ఆరోగ్యపరమైన పుస్తక పంక్తి. తెలుగువారి ఆహార చరిత్రకొక దిశను ఏర్పరచిన ఏకైక పరిశోధకుడుగా నిలిచాడు.


పత్రికల్ని నిద్రపోనివ్వని కాలమిస్ట్ పూర్ణచందు. ఒకేసారి తొమ్మిది పత్రికల్లో శీర్షికలు నడిపిస్తున్నాడు. సాహితీకృషీవలుడుగా అతడు పొద్దుచాలని సూరీడు. మరో పార్శ్వంలో అతడు కార్యశీలి. కార్యకర్త. కార్యదక్షుడు, కార్యదర్శి!

కృష్ణాజిల్లా రచయితల సంఘానికి సుబ్బారావు హార్డ్-వేర్ అయితే పూర్ణచందు సాఫ్ట్-వేర్ అని 20 యేళ్లక్రితమే రాళ్లబండి కవితాప్రసాద్ అన్నాడు. ఈ నాటికీ ఆ ఇద్దరిలో మార్పులేదు.

ఇంక **"ఆంధ్రగీతి"**-సాధారణ దీర్ఘకవిత కాదు "ఆంధ్రగీతి" అనగానే ఇది **"గత చారిత్రక యశఃకలాపం'** అనిపించవచ్చు. కానీ, అంతకు మించిన ఆవశ్యక నివేదిక. 10పేజీల అక్షరీకరణ, 7 ప్రకరణాలు: **"పూర్ణచంద్రాయణం'**తో మొదలు, **"అధికారభాష"**తో ముగింపు

ఈ కృతి సృజనాత్మకమైన రచన. రచన సృజనాత్మకం కావాలంటే మూస నుండి విడివడాలి. వస్తు స్పృహలో నవత్వం కావాలి. ఇక్కడ ఉన్నది అది. తెలుగుజాతి, భాష, సాహిత్యం, సంగీతం, సంస్కృతి, విజ్ఞానం, కళలచరిత్ర స్పర్శ ఉన్నది. వీటన్నింటి మూలాలు పరిణామాలు ఉత్థానపతనాల విజ్ఞప్తి ఉంది. నాటి ఘనతకు నేటి వాస్తవాల్ని పోల్చి చూపిన నిజాయితీ ఉన్నది.

**"వేదనాదాల నుండి సాపేక్ష వాదాల దాకా/ ఆదిమత నుండి అత్మికత' దాకా/ ఆటవికత నుండి 'ఆటమికత దాకా/ తెలివి పులకించిన తెలుగు పలుకు"..** ఈ కావ్యం! అందుకనే ఇది అతనే అన్నట్టు..





ప్రతులకు: క్రిష్ణ జిల్లా రచయితల అసోసియేషన్ మొదలి అంతస్తు, సత్యం టవర్స్, బకింగ్‌పేట్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా, గవర్నర్‌పేట్ విజయవాడ-520 002.
సెల్:94401 72642,94401 67697

**డా॥జి.వి.పూర్ణచందు రచన "ఆంధ్రగీతి" పుస్తకానికి విహారి రాసిన ముందు మాట...**

**"శబ్దం నుండి శాస్త్రం దాకా/ సంకేతం నుండి సంభాషణ దాకా/ బోధన నుండి భావన దాకా/ భాషాపరిణామాల తెలుగు స్వరతేజం!"**

పూర్ణచందు ఈకృతిలె తనివితీరా తెలుగుతల్లి గుణగానం చేశాడు. ఆబగా దోసిళ్ళతో అక్షరాల, పదాల, వాక్యాల, గ్రంథాల, వాఙ్మయాల అనుపానాల్ని ఆస్వాదించాడు. ఆఖరున ఒక చేదు నిజాన్నీ మెత్తని పులిలా వదిలాడు, 'భక్తిగల హృదయానికే గదా తెలుగులోని మాధుర్యం' అన్నది గట్టి చురకే! దాని తాకువల్లనైనా తెలుగుల మనసులు, ఆలోచనలు, ఆచరణలు సునిశితం కావాలి...!

మాండలిక శోభ కులుకులు అందించింది ఈ కావ్యం! భాషావతరణ అక్షరాల శక్తీ, రక్తీ ద్యోతకం చేసింది. ఇక **'వలంకంబడంల పరిమాళాలు'** అనే అధ్యాయం సొంపైన తెలుగు వాహికతో వచ్చి పులకలనిచ్చాయి. మినుకు పలుకులు పారిభాషిక పదాల కష్టసుఖాల్ని చెప్పుకున్నాయి.

అంధకుల నుంచీ ఆంధ్రుల దాకా భాషాపరిణామాలను వివరించి, "తెలిసి మసులుకో తెలుగువాడా" అనే హెచ్చరిక నిచ్చాయి. జాతి సంస్కృతి ప్రవాహినీ సదృశం. బస్సునీ రోడ్డునీ టిక్కెట్టునీ ఎవరాపగలరు? ఎందుకు ఆపాలి? జీవనదిని కొలుద్దామంటాడు కవి.

**'ఆంధ్రగీతి'** కవితాత్మకమైన రచన. ఏ వాక్యాన్ని స్పృశించినా దృశ్యస్పృహ మేధని ప్రోచదితం చేస్తున్నది.

**"చెట్టు మీద వాలిన చిలుకల కోలాహలం**
**అమ్మ మాటల్లో చేతనా ఛాయల వేదనాట్యం**
**పొలాలపై పరచుకున్న పచ్చని వెలుగుతీరమై**
**నదీజలాల అవర్తనంలో ఆమె తెలినవ్వులు"** అనగానే ఆ కావ్యభాషలో సహస్ర కిరణాల్లో చిత్రవర్ణ దృశ్యాలు శబ్దచిత్రాలై కళ్లకు కడతాయి. ఇంతకింత భావస్ఫోరకంగా..

**"చివురుటధరాలపై కొత్తపొద్దు నింపాదిగా**
**తడితడినవ్వులతో పూలజల్లులు కురిశాయి!**
**కొండల కుండలాల గణగణలుసన్నగా**
**నుదుట సిందూరపు హొయలతో భానూదయం"**

కవిత్వంలో అనిర్వచనీయతని మోయలేని సామాజిక వాస్తవికత రసాత్మకంగా చాలా పట్టుల్లో చెప్పాడు పూర్ణచందు.

**"భూమిని నాగలి ముద్దాడిన ఆదిమకాలాన/రాతిగూళ్ళలో దీపాలునవ్విన రోజున/కట్టుబట్టల కోసం జీవితపు అల్లిక నేర్చిన వేళ/ వంటకుండ కోసం కుమ్మరి చక్రం గిర్రున తిరిగినప్పుడు..** అంటూ నాగరికత వైభవ ఆరంభదశను వివరిస్తూ, **"అదిగో అప్పుడు అంకురించింది తెలుగు నుడి!"** అంటాడు.

ఇటువంటి చరణాలు భావుక భావ్యమానమైన గుణనైపుణ్యంతో కావ్యాన అందగించాయి. కావ్యం కవితాత్మకం కావాలంటే, కవికి శబ్దసంపద ఒక్కటే చాలదు. ఆ శబ్దాలతో అభివ్యక్తిని రవళింప చేయగల పనితనం కావాలి! పూర్ణచందుకి ఈ శబ్దార్థ సంయోజనాన్ని ఇచ్చే అభివ్యక్తి పుష్కలంగా ఉంది.

**"ఒక శబ్దం హృదయగవాక్షం తాకగానే/ ఆలోచనామేఘం వాక్యమై వర్షిస్తుంది!/ఒక 'నుడి' దివ్యవేద స్వరంగా ధ్వనించగానే/ ప్రతి మౌనమూ జాతీయ గీతమై పాడుతుంది!"** కవిత్వ సామాగ్రిని సంపాదించుకోవటమే గాక దాని పదునుని ఝుళిపింపగల అలంకారిక తృష్ణ లేనిదే ఇలాంటి కవితామయమైన చరణాలు రావు.

'ఆంధ్రగీతి' కావ్యవైభవాన్ని, శోభని, సౌభాగ్యాన్ని, నిదర్శించటానికి ఈ నాలుగు పంక్తులూ చాలు.. ఈ కవి ఎంతటి సాంద్రతరంగా, గాఢతరంగా మాటని కవిత్వం చేయగలడో.. ఈ రసాత్మక వాక్యాలు తేటతెల్లం చేస్తున్నాయి.

"వాక్యసాధకుడికి వానీప్రసాదమైనిలువు" అని తెలుగమ్మని వేడుకుంటాడు ఆర్తితో...!

ఈ కావ్యానికి, అందునా అజరామరంగా నిలువనున్న కావ్యానికి ముందుమాట ఎంతని రాయగలను...! ఆ పరిమితి ఈ పరిణత భాష సౌందర్య దర్శనాన్ని ఇక్కడే ఆపాలని హెచ్చరిస్తున్నది.

**"ఇరువది కోట్లసంతానవతి ఆమె/ విశ్వధాత్రి మా తెలుగు తల్లి"** అనీ, **"ఆమె భాష, ఆమె భాష్యం.. ఆమె భావం ఆమె చేతనా పరంధామం"** అనీ అన్నాడు.


ఈ భావన ప్రతి తెలుగు గుండెలో రవళించాలనీ, ప్రతీ తెలుగు రసనా నినదించాలనీ ఆకాంక్షిస్తున్నాను.

మండలి వెంకట కృష్ణారావుగారికి ఈ కృతి అంకితం అచ్చమైన నివాళి.

పూర్ణప్రజ్ఞానిధి, ప్రతిభాస్వంతుడు, రససిద్ధుడైన కవి పూర్ణచందుకు జేజలు.. శుభాశీస్సులు!

-విహారి
9848025600








-డా॥రావి రంగారావు
9247581825

ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా. రావి రంగారావు 2024 జనవరి నుంచి వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.

ఈ వారం నిర్వహించిన ఏడో కథల వర్క్ షాపు లో రెండు కథలను ఎంపిక చేయటం జరిగింది.

-సంపాదకులు

## అనుబంధం



రైతు సాంబయ్యకు తన తోట అంటే చాలా ఇష్టం. తోటలో ఓ పెద్ద మామిడి చెట్టు ఉంది. అది వాళ్ళ నాన్న గుర్తుగా నాటుకున్న చెట్టు. అందుకే దాన్ని చాలా అపురూపంగా చూసుకునేవాడు.

ఆ చెట్టును చూసినప్పుడల్లా ఆనందంగా ఉన్నా, సాంబయ్యకు ఏదో వెలితిగా అనిపించేది. ఆ చెట్టు ఒంటరిగా ఉన్నట్లు, తోడు కోసం ఎదురు చూస్తున్నట్లుగా అనిపించేది. అలా ఆలోచిస్తున్న సాంబయ్యకు ఎందుకో వాళ్ళ అమ్మ, ఆమెకు ఇష్టమైన మల్లెలు గుర్తుకు వచ్చి మెరుపులా ఓ ఆలోచన వచ్చింది. అంతే... హుషారుగా తన పెరటిలో ఉన్న ఓ మల్లెచెట్టు తవ్వి ఆ మామిడి చెట్టు ప్రక్కనే నాటాడు. ఎంతో సంతృప్తిగా అమ్మ నాన్న ప్రక్క ప్రక్కనే ఉన్నట్లు అనిపించి సంతోషంగా ఇంటి దారి పట్టాడు..

ఆ రాత్రి మామిడి చెట్టుకు విపరీతమైన కోవం వచ్చి మల్లె చెట్టుతో గొడవ పెట్టుకుంటూ "ఇక్కడ కూడా నన్ను వదలవా, ప్రశాంతగా ఉండనీవా, ఇన్నాళ్లు ఒంటరిగా హాయిగా ఉన్నాను... ఇపుడు ప్రశాంతతను పోగొట్టావు.


అయినా నిన్ను అని ఏం లాభం, మన కొడుకు సాంబయ్యను అనాలి, నిన్ను తెచ్చి నా ప్రక్కన తగలేశాడు, బుద్ధి లేదు వాడికి... మనం బ్రతికి ఉన్నన్నాళ్ళు నిన్ను ఒక్కమాట అననీకుండా వెనకేసు కొచ్చేవాడు. ఇప్పుడు చచ్చాక కూడా ప్రక్కనే నిన్ను తెచ్చి పెట్టాడు. రానీ వెధవని కడిగేస్తా..." అంటూ బుసలు కొడుతున్నది మామిడిచెట్టు. మల్లె చెట్టు మాత్రం "వాడినేం అనకయ్యా, మన గొడవల్లో వాడిని లాగవద్దు, మీ అయ్యా మా అమ్మా... అన్నా చెల్లెళ్ళు అయి వాళ్ళ బంధం నిలిపుకోవటం కోసం నీకు ఇష్టం లేక పోయినా నన్ను నీకిచ్చి చేశారు. ఈ సంగతి వాడికి తెలీదుగా... మనం బ్రతికి వున్నన్నాళు ఇట్టానే కొట్టుకున్నాం. ఇది తెలీక సాంబడు నేను సచ్చాక కూడా నన్ను నీ ప్రక్కన తెచ్చి పెట్టాడు. నీకిట్టం లేకుంటే నేను ఇప్పడే సచ్చిపోతా... కానీ మన బిడ్డ జోలికి ఎల్లమాక" అంటూ వేడుకుంది మల్లెచెట్టు.

ఇలా రోజూ వాదనలే. సాంబయ్యకు మల్లె, మామిడి చెట్లను చూస్తుంటే అమితమైన ఆనందంగా ఉంది. ఎందుకంటే ఆ మల్లెచెట్టు వాళ్ళ అమ్మ చనిపోయే కొద్ది రోజుల ముందు పెరటిలో నాటింది. ఆమె ప్రాణం ఆ మల్లెచెట్టు లోనే ఉంది అని గట్టి నమ్మకం. కానీ మల్లె, మామిడి మాత్రం ఉప్పు, నిప్పులా చిటపట లాడుతూనే ఉన్నాయి.

ఒక రోజు సాంబయ్య ఒక బిందెతో నీళు తీసుకొని వచ్చి ఆ రెండు చెట్లను తేరిపార చూస్తే ఏదో దిగాలుగా, కాంతి హీనతగా అనిపించింది సాంబయ్య మనసుకి. వెంటనే ఆ రెండు చెట్లకు మధ్యలో కూర్చొని "మీ రిద్దరిని నా తల్లి దండ్రులుగా అనుకున్నా, మీరిద్దరూ అందంగా ఎదుగుతూ ఉంటే నా అమ్మా నాన్న నాతో ఉన్నారని సంబరపడ్డా. నాకు వాళ్ళు చిన్న వయసులో దూరమయ్యారు. వాళ్ళ ప్రేమను నేను ఎక్కువ గా పొందలేక పోయా, ఆ బాధను దిగమింగి మా నాన్న,అమ్మ గుర్తుగా మిమ్మల్ని నాటి మీలో వాళ్ళని చూసి ఆనంద పడుతున్నా, కానీ ఏమైందో మీకు... ఏదో గొడవపడి అలిగి మూతి ముడుచుకున్నట్లు, ఆకులు ముడుచుకొని దిగాలుగా ఉన్నారు. నేను మిమ్మల్ని ఇలా చూసి భరించలేక మీకు చెబితే నన్నా అర్థమవుతుందని చెబుతున్నా..

.రేపటిలోగా మీలో మార్పు వస్తే సరే, లేకుంటే నా ముఖం మళ్ళీ మీకు చూప"నని కళ్ళు తుడుచుకుంటూ అక్కడి నుండి వెళ్లి పోయాడు.

మరునాడు ఉదయాన్నే ఆ చెట్ల దగ్గరకు వచ్చిన సాంబయ్య ఆశ్చర్య పోయాడు. కారణం... అంతకు ముందు రోజు వరకు మామిడి చెట్టుకు దూర దూరంగా ఉన్న మల్లె తీగలు ఈ రోజు మామిడి చెట్టును గాఢంగా అల్లుకొని విప్పారిన ఆకులతో ఆ రెండు చెట్లు కన్నుల పండుగగా కనిపిం చాయి మరి..



-పరుచూరి కృష్ణ భార్గవి

## బంధం-బలం

ఒక తోటలో మామిడి చెట్టు, ఒక మల్లె చెట్టు ఉన్నాయి. ఎండాకాలం రాగానే ఒక రోజు ఎందుకో మామిడి చెట్టు మల్లె చెట్టుమీద కోప్పడింది."నీవు చిన్నదానివి. నా పక్కన వద్దు. దూరంగా పో" అని గొడవ పెట్టుకుంది.

"పొమ్మంటే పోవడానికి నేను మనిషినా ఏమిటి?" అని ప్రశ్నించింది మల్లెచెట్టు.

"అదంతా నాకు తెలియదు. నువ్వు నా నుండి దూరంగా వెళ్ళాల్చిందే"

"ఎలా వెళ్ళాలో నువ్వే చెప్పు?

"నువ్వు ఎండిపోయావనుకో! ఇక చాలు."

"కానీ నాకు చావాలని లేదు. ఘుమఘుమలాడే మల్లె పూలు ఇప్పుడు కాస్తున్నాయి. ఆ పరిమళం నీకు కూడా వస్తుంది కదా!"

"నీ పరిమళం నాకెందుకు?నా లేత ఆకులు తిని కోయిలలు కమ్మని పాటలు పాడతాయి. ఆకులు పండుగలప్పుడు గుమ్మానికి వేలాడతాయి.ఇక పళ్ళ సంగతి చెప్పనక్కరలేదు. అందరూ కొనుక్కొని మరీ తింటారు" అంది మామిడి చెట్టు.

"నా పూలు అందరూ మురిపెంగా కోసుకొంటారు. దేవునికి, శుభకార్యాలకు మల్లెపూలు ఉండాల్సిందే కదా!" అన్నది తాపీగా మల్లె చెట్టు.

"అదంతా నాకు అనవసరం. నువ్వు నా పక్కన వద్దు. వెళ్ళిపో" అని గట్టిగా చెప్పింది మామిడి చెట్టు.

"ఇప్పటికి ఇప్పుడు పొమ్మంటే ఇక్కడికి వెళతాను?" అన్నదో లేదో ఒకతను వచ్చి పూలు కోసుకెళ్ళాడు.

"చూశావా? నువ్వు నన్ను పొమ్మన్నా నా కోసం వచ్చేవారు ఉన్నారు" అన్నది మల్లె చెట్టు.

"నాకోసం వచ్చేవారు కూడా ఉన్నారు తెలుసా!" అన్నది గర్వంగా మామిడి చెట్టు.

"అరె ! ఇక్కడ మల్లె చెట్టు ఎప్పుడు వచ్చింది?గమనించలేదు. రేపు మంచి పూలు పూసేలా ఉన్నాయి. మా ఆవిడకు మల్లె పూలంటే ఇష్టం" అనుకొని కాసిని నీళ్ళు పోసి తోటమాలి వెళ్ళాడు.

"చూశావా! నువ్వు చేస్తున్న పనికి నీ తోటమాలి కూడా పట్టించుకోవడం లేదు"

"రేపో మాపో పూత వస్తుంది. అప్పుడు చెబుతా నీ సంగతి'' అని అప్పటికి ఊరుకుంది మామిడి చెట్టు.

తెల్లవారగానే తోటమాలి వచ్చి మల్లె పూలు కోసుకొని సంతోషంగా ఇంటికి వెళ్ళాడు.

ఆ చర్యకు మామిడి చెట్టుకు మరింత కోపం వచ్చింది.

"నువ్వంటే మా తోటమాలి కూడా నన్ను పట్టించుకోవడం లేదు. నిన్ను నామ రూపాలు లేకుండా చేస్తాను" అన్నదో లేదో ఈదురు గాలులు ప్రారంభం అయ్యాయి. కారు మబ్బులు కమ్మి చల్ల గాలి ప్రభావంతో చినుకులు పడసాగాయి.

ఆ రాత్రికి వర్షం పెరిగింది. ఉరుములు, మెరుపులతో అంతా చీకటిగా ఉంది. అప్పుడే ఒక పిడుగు మామిడి చెట్టు దిశగా వచ్చింది.

మామిడి చెట్టు సగం వరకు కాలిపోయింది.

వర్ష ప్రభావం తగ్గగానే మల్లె చెట్టు మరింతగా శోభిస్తుంటే మామిడి చెట్టు "నేనిక బ్రతకనేమో" అని ఏడ్వసాగింది.

"అలా ఏడవకు మిత్రమా!అందరం ఎప్పటికైనా పోవాల్సిందే కదా! వర్షం వల్ల భూమిలో నీటికి కొదువ లేదు. ఆశ అనేది ఉంటే చిగురు వేయడం ఎంతసేపు" అంటూ ఓదార్చింది మల్లె చెట్టు.

"ఓ మల్లె చెట్టూ! నువ్వు ఎంత మంచిదానివో, నీ మాటలే చెబుతున్నాయి. అందరి బాగును కోరితేనే మనం పచ్చగా ఉంటామని నాకు అర్థం అయింది. నన్ను క్షమించు"

"మనలో మనకు క్షమాపణలు ఎందుకు? మనం ఇతరులకు మేలు చేసేవారమే కానీ కీడు చేయము. మనం చేసిన పరోపకారం మనకు రక్ష. మన జీవితమే త్యాగాల మయం. మన త్యాగ ఫలమే మనుషులకు ఆహారం, ఇల్లు,నీడ.... మనమూ, వారు కలిసి బ్రతకాల్సిందే! వారు మనలను నరుకుతూ కష్టాలు పెట్టినా మళ్ళీ మళ్ళీ పుడుతూ ఈ భూమిపై చిరకాలం ఉండేది మనమే!"

"అవును. మన వల్లనే మనిషి భూమిపై బ్రతుకుతున్నాడు. మనది ప్రత్యేక బంధం" అంది మామిడి చెట్టు.

"ఇప్పటికైనా మంచిగా మారావు. అదే బలం నీకు. మళ్ళీ కొత్తగా కొమ్మలతో పచ్చగా బ్రతుకుతావు" అంది మల్లెచెట్టు.





-బి.సుబ్రహ్మణ్యం.



## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
**'బుధవారం బాద్షా'**
**పోటీ ఫలితాలు**





అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

### తోడునీడ

ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి
చెట్టు మీది కాయకు సముద్రంలోని ఉప్పుకు
బంధం ఏర్పడినట్లు
మూడుముళ్ల బంధంతో పుట్టింటి గడపదాటి
మెట్టినింటికి చెరె పసిడి మనిషి ఆమె.
ముచ్చటైన మూడుముళ్లతో మొదలైన బంధం
ఒడువని చిరునవ్వులతో
మానసికోల్లాసంతో
జీవితాంతం తోడు నీడగా
సాగే ఆలుమగల అనురాగ అనుబంధం.
కన్న కలలు కనుమరుగైనా,
కట్టుకున్న వాని ఉన్నతికి మార్గంవేస్తూ
బరువు ,బాధ్యతలను అలవోకగా మోస్తూ
ఇంటిల్లిపాదికి తలలోని నాలుకలా ఉంటూ,
తనను తాను ఆనందంగా నిలబెట్టుకునే తన్వి.
బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త,
వృద్ధాప్యంలో కొడుకు చేతుల్లో
కొనసాగే జీవనమైనా,
అంతా తనదేనంటూ
అన్నింటాతానే ఉంటూ,
వీచే చిరుగాలిలా పారేటి నదిలా....
విరబూసిన పువ్వులా
రరగగనమంతటి నవ్వులతో
పచ్చని ప్రకృతిలో
గలగల పారే సెలయేరులా
అందరినీఅదరించే
మరపురాని, మరచిపోని
దాంపత్యపు
సుమ గంధమామె.

-డా. బండారి సుజాత

### భలే మంచి రోజు

విడి విడిగా ఉన్నవారిని
ఒకటిగ చేసిన రోజు
మేలి ముసుగు అడ్డు తెరదొలిగిన రోజు
కలిమి లేములలో తోడు నీడౌతామని బాస చేసిన రోజు
మూడు ముడులతో శాస్వత బంధ మేర్పడిన రోజు
దైవ ప్రతినిధుల ఆశీస్సులు పొందిన రోజు
అన్యోన్య దాంపత్యానికి బాట వేసిన రోజు
జీవన నావకు చుక్కాని అమరిన రోజు
బాంధవ్య బాధ్యతలను గుర్తెరిగిన రోజు
ఇరు కుటుంబాలను కలిపిన రోజు
ఒకరి కోసం ఒకరని నమ్మిన రోజు
జీవిత సాఫల్యతకు నాంధి పలికిన రోజు
బంధు మిత్ర గణంతో సంతసించిన రోజు
విందు వినోదాలతో గడిపిన రోజు
నూరేళ్ళ జీవితానికి శ్రీకారం చుట్టిన రోజు
దంపతులై సంసార యానం ఆరంభించిన రోజు
ముత్తైదువులు బిడ్డలప్రాప్తికై దీవించిన రోజు
అరమరికలు లేని సంసారానికి అంకితమైన రోజు
ఎన్నటికీ మారని మరువని మధురమైన రోజు
అదే.. అదే... పెళ్ళి రోజు! భలే మంచి రోజు!!.

-కొల్లాబత్తుల సూర్య కుమార్

### అర్ధనారీశ్వరం

"ఆడుతూ పాడుతూ పనిచేస్తుంటే",
అన్నమాటకి నిదర్శనం వీరేనంట!
భార్యకి భర్త చేదోడు వాడోడుగా ఉంటే,
ఇల్లే కదా స్వర్గసీమ అంట!.
ఒకేమాట ఒకేబాణం రాముడంట!
ఆయనే ప్రతీ జంటకు ఆదర్శమంట!
సంపాదించి తెచ్చుట భర్త కర్తవ్యమంట!
ఇల్లు సద్ది గడుపుట పడతికి ఆరోగ్యమంట!

పూర్వకాలంలో మగవారు వేసేరంట,
ఆడవారిగా వేషాలు భేషుగానంట!
వంటవార్పు పడతికే కాదంట,
నలభీములు కూడా ఆరితేరారంట!.

భర్తని కూడా కొడుకనుకున్న ఇల్లాకేనంట,
తల్లిగా చెలిగా సేవ చేసే భాగ్యమంట!
ప్రతీ ఇల్లాలు చేదోడు వాదోడుంటే నంట,
సిరులు ఇంటింటా తాండవ మాడునంట!.

-యలమర్తి మంజుల
విశాఖపట్నం



### మధురానుబంధ మాలిక

మనసులు కలిసినప్పుడు జీవితం మధుర గీతమవుతుంది
ఆప్యాయత పూలతో దారి సుగంధమై విరిసె సుఖమవుతుంది
చిన్న చిన్న మాటల్లో పెద్ద ప్రేమ దాగి ఆనందమవుతుంది.
అడుగడుగునా తోడు నీడలా నిలిచే బంధం అమూల్యమైనది.
కలహాల్లో కూడ ప్రేమ సుగంధంలా కరిగి మిగులుతుంది.
క్షమించే హృదయం బంధానికి కొత్త వెలుగునిస్తుంది.
సంతోష క్షణాల్లో నవ్వులు ముత్యాలై జారిపడుతాయి.
దుఃఖ సమయాల్లో చెయ్యి పట్టి ధైర్యం నింపుకుంటారు.
ఆశల ఊయలలో కలలు కలసి ఊగిపోతారు ఇద్దరు.
బాధల బరువును భాగస్వామ్యం చేస్తే తేలిక అవుతుంది.
మాటల్లో మాధుర్యం చూపుల్లో సత్యం నిండివుంటాయి.
ఒక్క చూపుతోనే హృదయ భావాలు అర్థమవుతాయి.
కాలం మారినా ప్రేమ పరిమళం చెదరదు ఎప్పుడూ.
అనుబంధం వేర్లు లోతుగా పాతుకుపోయి నిలుస్తాయి.
జీవన యాత్రలో చేతులు కలిపి సాగితే సుఖమయమై,
అన్యోన్య దాంపత్యం జీవితం అందమైన కవిత అవుతుంది.

-రాజకుమారి, 9000434357

# గత నూరేళ్లలో కవిత్వ ప్రక్రియల విస్తరణ భిన్న వస్తు రూపాలు

గత దశాబ్దికి పైగా యాకూబ్ వచన కవితను ఒక ఉద్యమంగా ప్రోత్సహిస్తూ అనేక కవితా సంపుటాలకు దారి వేసారు. సినిమాల్లో సుద్దాల అశోక్ తేజ, చంద్ర బోసు, మిట్టపెల్లి సురేందర్ మొదలైనవారు సినిమా పాటలతో ప్రభంజన సృష్టిస్తున్నారు. ఉద్యమ కవులు జయరాజు, గోరటి వెంకన్న, అందెశ్రీ తదితరులు ప్రకృతి పర్యావరణ కవిత్వం లోకి మలుపు తిరిగారు. సమస్యా పూరణకవిత్వం, ప్రతిదీ పద్యాల్లో చెప్తా ననే బొద్దుల లక్ష్మయ్య, శతకాల పద్యకృతులు, మరోవైపు వర్ణన, లేదా నిర్వచనం వంటి నానీలు, ఏక వాక్య కవితలు మొదలైన అనేక రీతుల్లో తెలుగులో కవితా ప్రక్రియ విస్తరించింది. ఉద్యమ పాట కవిత్వంలో గద్దర్ రాసినంత వస్తు వైవిధ్యంతో రాసిన వారు మరొకరు లేరు. 1990 తరువాత స్త్రీ వాద కవిత్వం వెలికి తీసినంతగా లింగ వివక్ష, అంతకు ముందెపుడూ ఎవరూ చేయలేదు. 1985 నుండి కవిత్వంలో వర్ణ కు వివక్ష అణిచి వేతలు మునుపెన్నడూ లేనంత బలంగా విస్తరించింది. అనేక రకాల ప్రక్రియల వేలాది కవితలను నేటి నిజం దిన పత్రిక ప్రచురించి రికార్డు సృష్టించింది.

## ముప్పయికి పైగా కొనసాగుతున్న కవితా ప్రక్రియలు

పాతికేళ్ల క్రితం శతాబ్దాంతంలో తెలుగు కవిత్వం తీరు తెన్నులు అనే అంశం పై అడిగి రాయించి ఆంధ్ర జ్యోతి వీక్లీలో వేసారు. అపుడు కవిత్వంలో ఇరవై ఐదు రకాల ప్రక్రియలు కొనసాగుతున్నాయని రాసాను. ఇపుడు మళ్లీ పాతికేళ్లకు అలాంటి అవసరవే తోసుకొచ్చింది. ఇపుడు కవిత్వంలో సుమారు ముప్పయి పైగా ప్రక్రియలు కొనసాగుతున్నాయి. దేని అవసరం దానికుంది. దేని పాఠకులు దానికున్నారు. ఒకరికొకరు పాఠకులను గెలుచుకోవడంలో పోటీ పడాలి తప్ప కవుల మధ్య తమదే గొప్ప అనే చర్చలు అర్థ రహితం. అది ప్రజలకు లేక పోతున్న అసమర్థుల ప్రయాస అని గమనించి పట్టించు కోవడం మానేస్తే మంచిది. ప్రజల పాటలు సినిమాలకు వచ్చాయి. ఉద్యమాలకు వచ్చాయి. అలాగే సినిమా పాటలు గుళ్లలో భజన పాటలకు ట్యూన్ లుగా మారాయి. ఇలా పరస్పర ప్రభావితమవతున్నాయి కవితా ప్రక్రియలు .

## కవిత్వానికి రకరకాల నిర్వచనాలు.

కవిత్వం అనే సాహిత్య ప్రక్రియ పట్ల భిన్న అవగాహనలు కొనసాగుతున్నాయి. కవిత్వం కప్పి చెపుతుంది. విమర్శ విప్పి చెపుతుంది అన్నారు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి నారాయణ రెడ్డి గారు. అర్థం కాని కవిత్వం వ్యర్థం అన్నారు మరొకరు. కవులు తమ కవిత్వం ఎలాంటిదో చెపుతుంటారు. అదేదో కవిత్వంలో చెప్పక, వ్యాసాల్లో , ఉపన్యాసాల్లో చెప్పడం దేనికి? కవిత్వ ప్రక్రియలతోనే చెప్పండి అని విద్యార్థులకు సూచించాను. అది తమనే అన్నారనుకొని కవుల మీద అంత కోపమెందుకు సార్! అన్నారు. చక్కగ రాయండి. బాగా నేర్వండి. పలురీతులను, పలు భాషల కవిత్వాన్ని అధ్యయనం చేయడం ద్వారా అభివ్యక్తి ప్రతిభ వికసిస్తుంది.

ఈ మధ్య తెలుగులో కవిత్వానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. వైరముత్తు అనే తమిళ కవికి జ్ఞాన పీఠ పురస్కారం ప్రకటించారు. వైర ముత్తు కవిత్వం మీద, వ్యక్తిత్వం మీద జయ మోహన్ వంటి వారు దేశ వ్యాపితంగా విరుచుకు పడుతున్నారు. కవిత్వానికి ఎవరి నిర్వచనం వారిది. టీవీ చానల్లలో పల్లె పాటలు కోట్లాది వీక్షకులనా ఆకర్షిస్తున్నాయి. సరే అదలా ఉండనీ!

## సాహిత్యంలో కవిత్వం ఒక ప్రక్రియ

భావ వ్యక్తీకరణకు అనేక మార్గాలున్నాయి. "చెంపకు చేయి పరంబైన కంటికి కన్నీరాదేశంబగు" విధంగా భౌతిక చర్యలు , హావ భావ భావాలు, కంటి చూపులున్నాయి. భావ వ్యక్తీకరణ రీతులతో సాహిత్యం రూపు దిద్దుకున్నది. అట్లాంటి సాహిత్యంలో కవిత్వం అనేది ఒక ప్రక్రియ. పాట అనే ప్రక్రియ కవిత్వంలో తొలి ప్రక్రియ . ఇపుడు పాటను కవిత్వంలో భాగంగా చర్చించకుండా వదిలేస్తున్నారు. కవి సమ్మేళనాల్లో పాట కవులను ఆహ్వానించడం పట్ల విముఖత ప్రదర్శిస్తుంటారు.

## పాట నుండి అనేక ప్రక్రియలు పుట్టాయి

పాట నుండి అనేక ప్రక్రియలు పుట్టాయి. పద్యం అందులో ఒకటి.

వేల సంవత్సరాలు గడిచాక ఇటీవల తెలుగులో వచన కవిత అనే ప్రక్రియ పుట్టింది. వచన కవిత్వ ప్రక్రియ పుట్టి ఇంకా వందేళ్ల కాలేదు. గురజాడ, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, ఉన్నవ లక్ష్మి నారాయణ, గేయ కవిత్వం రాసారు. ప్రాచీన కవిత్వంలో కావ్యాలు పద్యాలు, మధ్య మధ్యలో గద్యం రాసారు. దాన్ని చంపు కావ్యం అన్నారు. ప్రాచీన కవిత్వంలో పాటలతో కావ్యాలు ప్రదర్శన కళా రూపాలు ప్రజల్లో చొచ్చుక పోయాయి. వాటిని జానపద కళలు అన్నారు. పద్యాలతో సంస్కృతంలో , తెలుగులో కావ్యాలు నాటకాల రూపంలో వెలయించారు.

## వాక్యం రసాత్మకం కావ్యం

వాక్యం రసాత్మకం కావ్యం అన్నారు. కావ్యేషు నాటకం రమ్యం అన్నారు. ఇపుడు సకల కళల సమాహారంగా ఎదిగిన సినిమాకు ఈ మాట వర్తిస్తుంది. వివిధ స్థాయీ భావ దశలను( మూడ్సును, సెంటిమెంట్లను) రసం స్థాయికి ఉదాత్తీకరించడం, ఉన్నతీకరించడాన్ని రసాత్మకం చేయడం అని చెప్ప వచ్చు. అలా రసాత్మక వాక్యమే రమ్యం అని సాహిత్య శాస్త్ర వేత్తలు ఒక నిర్వచనం ఇచ్చారు. ధన్యాత్మక వాక్యం, వక్రోక్తి వాక్యం కూడా కావ్యమే అని నిర్వచనాన్ని విస్తరించడం జరిగింది. కరుణ శృంగార వీర, ఆది నవ రసాలు, భక్తి రసం - ప్రతిభావాన్ని రసం స్థాయికి తీసుకెళ్లడం వచ్చు అని అందు వల్ల రసాలు అనంతం అన్నారు.

## పద్యాల్లో రకరకాల ప్రక్రియలు

శతాబ్దాలుగా కావ్యాలు, పురాణ ఇతిహాసాలు, ప్రబంధ కావ్యాలు, నాటకాలతో పాటు చాటువులు, సూక్తులు, సందేశాలు, ఉపదేశాలు, నీతి ప్రబోధాలు పద్యాలు, పాటలు, సామెతలు , ఖండ కావ్యాలు, ముక్తకాలు, శతక కావ్యాలు, సంవాదం, చిత్ర కవిత్వం, రెండర్థాల ద్వర్థి కావ్యాలు , త్ర్యర్థి కావ్యాలు వెలిసాయి. కథాత్మక కావ్యాలు, కథా రహిత కావ్యాలు, కవిత్వాలు మొదలైన అనేక విధాలుగా కవితా ప్రక్రియలు వికసించాయి. కాగితం . ప్రింటింగ్ ప్రెస్ లేక ముందు తాటాకులు తోలు, రాల్లు, రాగి రేకులపై రాసి భద్రం చేసారు. తాటాకు మీద రాతకు ఆయుష నాలుగు వందల ఏళ్లు! కాగితం పుట్టాక మాటకు విలువ తగ్గి దస్తావేజులకు , సంతకాలకు విలువ పెరిగింది. సరే అదలా ఉండనీ!

## పాట యొక్క జ్ఞాపక శక్తి

పాట, పద్యం, సామెత, నుడికారం జ్ఞాపకం ఉండడానికి రాగ యుక్తంగా లయాత్మకంగా ఉండడం కారణం. . అలా విధంగా లేనిది గుర్తుంచుకోవడం సాధ్యం కాదు. ఉదాహరణకు నేటి వ్యాసం, కథ , నవల, సంపాదకీయం యధాతథంగా గుర్తుంచుకోవడం సాధ్యం కాదు. దాని రాసిన రచయితకు కూడా అది సాధ్యం కాదు.

జ్ఞాపకం లేనపుడు అది ప్రభావం ఎలా వేస్తుంది అనే జ్ఞాన శాస్త్ర విషయం. జ్ఞాపక శక్తికి లయాత్మకతకు సంబంధం ఉంది. పాటపుట్టుక అనే గ్రంథంలో ఈ విషయం వివరంగా రాసి వున్నాను. పాటలో పల్లవిని మళ్లీ మళ్లీ పాడడం అనే అంశం కూడా జ్ఞాపక శక్తి పై బలమైన ముద్ర వేస్తుంది. పల్లవి ఒకటే గుర్తుండి చరణాలు మరిచి పోవడం గమనించవచ్చు.

శతక పద్యాలు బాగా గుర్తుంటాయి వేమన పద్యాలు, సుమతీ శతకం, పోతులూరి వీర బ్రహ్మం పాటలు, అచల తత్వాలు, నరసింహ శతక పద్యాలు మొదలైనవి బాగా గుర్తుంటాయి.

## గత వందేళ్లలో తెలుగు కవితా వస్తు రూపాల ప్రయాణం

వచన కవిత్వం ప్రధాన స్రవంతి కాక ముందు గత వందేళ్ల కవిత్వం వస్తు రూపాలు ఒకసారి చూద్దాం. గిడుగు రామ్మూర్తి వ్యావహారిక భాషా ఉద్యమం కొద్దిగా పద్యం మీద కూడ పడింది. మేదరి బాగయ్య/ భాగ్యరెడ్డి వర్మ సంఘ సంస్కరణ ఉద్యమం , మరొక చోటనుండి అంటరాని తనాన్ని ప్రశ్నిస్తూ " అందారు పుట్టుకు హిందమ్మ తల్లికి" అనే పాట ప్రాచుర్యం పొందిందింది.

పల్లెల్లో కుల పురాణాలు రామాయణ భారతాలు, రకరకాల యక్షగానాలు, శారదకాండ్లు పాటలతో కథలు గాథలు, గురజాడ దేశభక్తి గేయం, రాయప్రోలు సుబ్బారావు "ఏ దేశమేగినా ఎందుకాలిడినా" పాట.

### తొలి రైతు పాటల విప్లవ కవి రామసింహ కవి

దానికన్నా చాలా ముందే కరీంనగర్ ప్రాంతం నుండి భారత దేశంలో కమ్యూనిష్టు పార్టీ పుట్టక ముందే రామ సింహ కవి " భూస్వామి ఎవడురా? దున్నే వానిదే భూమిరా!" అంటూ పాటలు పాడుతూ గుర్రం మీద వస్తుంటే దొరలు అవి వినలేకా పారిపోయేవారు. రామసింహకవికి జగిత్యాల సమీప గ్రామంలో గుడి కట్టించారు.

## లేని దుఃఖం విషాదం లేని ప్రేయసి పై కవిత్వం

ఇక అందరికీ తెలిసిన లేని ప్రేయసి పై, ఆమె నిరాకరించినట్టు విషాద కవిత్వం చాలా వచ్చింది. ఆ తరువాత బసవరాజు అప్పారావు, విశ్వనాథ సత్యనారాయణ , జాషువా పద్య కవిత్వం, మరోవైపు "మా కొద్దీ తెల్ల దొర తనము" పాట, " భరత ఖండంపై చక్కని పాడియావు" పద్యం, జానపద భాషలో " ఎంకి నా ఎంకి నాయుడు " నండూరి సుబ్బారావు పాటలు, "ఊహా ప్రేయసి కవిత్వం ఇంగ్లీషు నుండి ఉర్దూ నుండి అనుసరణ . అందని ప్రేయసి విషాదం పై అనేక పాటలు పద్య కృతులు, జాతీయ వాద కవిత్వం, జాషువా బహుముఖీన వస్తు విస్తృతి..

## తొలి అభ్యుదయ కవి ఉన్నవ

వాటికి ముందే ఉన్నవ లక్ష్మి నారాయణ మాల



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ చైర్మన్
ఫోన్: 8331966987

పల్లి నవలలో మూడు అభ్యుదయగీతాలు, ఆ తరువాత రష్యా విప్లవ స్ఫూర్తితో శ్రీశ్రీ మహా ప్రస్థాన గేయాలు, కృష్ణ శాస్త్రి కవిత్వం, అపుడు క్రమంగా వచన కవిత్వ పాయ మొదలైంది.

## అనుకరణ కవితలు

"దేశమును ప్రేమించుమన్నా గురజాడ కవిత ఇంగ్లీషు కవితకు అనుకరణ అని, కృష్ణ శాస్త్రి ఆకులో ఆకువై ఒక ఉర్దూ కవికి అనుసరణ లేదా అనువాదం అని, తేల్చారు. తెలుగు కవిత్వంలో ఉర్దూ ఇంగ్లీషు కవుల ప్రభావం హెచ్చు. శ్రీ శ్రీ కవితలు చాలా మేరకు అనువాద కవితల్లాంటివేనని పరిశోధకులు తేల్చారు.

## లలిత గీతాల సృష్టి

వచన కవితకు కాస్త ముందుగా లలిత గీతాలు రేడియో సృష్టించిన ప్రక్రియ అని వడ్డేపల్లి కృష్ణ తేల్చారు. మరోవైపు సినిమా పాట విస్తరిస్తున్నది. జాతీయ భావాలు, సామాజిక చైతన్య పాటలు సిన్మా పాట సాహిత్యంలో వెలువడ్డాయి, ప్రేమలు విషాదాలు, విరహాలు , కరుణ, శృంగార భయ , వీర రస పాటలు పద్యాలు సినిమాల్లో విస్తరించాయి. గ్రామీణ ప్రాంతాల్లో బావా మరదల్ల సరసమైన పాటలు, యుగళ గీతాలు వెలువడ్డాయి. ప్రజానాట్యమండలి సుద్దాల హనుమంతు, నాజర్, బుర్ర కథ గానంలో పద్యాలు పాటలు జాతీయ చైతన్యం కోసం ప్రజల ప్రక్రియను స్వీకరించారు.

## ప్రజల భాషకు చేరువగా తెలుగు సాహిత్య భాష క్రమంగా గ్రాంథికం నుండి సరళ గ్రాంథికం

సరళ గ్రాంథికం నుండి వ్యావహారిక శిష్టుల అగ్రకులాల భాషకు, వ్యావహారికం నుండి ప్రజల భాషకు చేరువవుతూ వచ్చింది. అదే సమయంలో ముగ్దుం మొహిద్దీన్, కాళోజీ , సి నారాయణ రెడ్డి గేయ కావ్యాలు, వస్తువులో ఆదర్శీకరిస్తూ మద్యపాన కవిత్వం సూఫీ ఆధ్యాత్మిక కవిత్వం కలగలుపుగా వచ్చిన కవిత్వం. చెర్విరాల బాగయ్య రాసిన వందకు పైగా చిరుతల , యక్షగాన కావ్యాలు - తెలంగాణ ప్రాంతంలో భాషా ఉద్యమం గ్రంథాలయ ఉద్యమం కాళోజీ / మేర మల్లేశం, యాదగిరి , ఆరుద్ర త్వమేవాహం , అంతకు ముందే మరికొన్ని కావ్యాలు

సురవరం ప్రతాప రెడ్డి , అడవి బాపిరాజు, కుసుమ ధర్మన్న పద్యాల్లో పేర్కొన్న నిజాం ప్రాంత కవులు సంఘ సంస్కర్తలు.

అరసం దిగంబర కవిత్వం

1950 నుండి సినిమాల్లో అభ్యుదయ కవుల సాహిత్యం . సినిమాల్లో క్లాసికా పాటలు, సామాజిక చైతన్య పాటలు, 1965 దిగంబర కవులు బట్టలు విడిచేసిన బూతులతో ప్రజల భాషను ముందుకు తెచ్చారు. పైగంబర కవులు/ తిరుగు బాటు కవులు , చేతనాల్తో కవులు, యువ భారతి కవులగుంపులు సినిమా పాటల ఉధృతి క్లాసిక్ సినిమా పాటలు. సివి రచనలు సి విజయ లక్ష్మి కవితా సంకలనం.

## ఉద్యమాల కవిత్వం

1969 జై తెలంగాణ ఉద్యమ సాహిత్యం కాళోజీ మేర మల్లేశం

1970 విరసం ఆర్ట్ లవర్స్ గాంధీ అంబేద్కర్ బుర్ర కథలు కమ్యూనిస్టుల పాటలు

1972 జన నాట్య మండలి అరుణోదయ . 1950లలో ప్రజా నాట్య మండలి మరో దశ

సుద్దాల హనుమంతు ఆకు పత్తిని శ్రీరాములు నాజర్. ఇలా కవితా వస్తువు బహు ముఖీనంగా విస్తరించింది. కవిత్వ ప్రక్రియల్లో వైవిధ్యం. అలా సాగింది. అదలా వుంచుదాం.

## వచన కవిత్వ ప్రారంభ వికాసాలు

కవిత్వం అందరికీ అందుబాటులోకి తేవాలని , పద్యాల చందస్సు ఇబ్బంది పెడుతుందని మధ్య తరగతి అక్షరాస్యులు పద్యం నుండి పాటకు, మరోవైపు వచన కవిత్వానికి రెండు పాయలుగా విస్తరించారు. నంబూరి గారి ఎంకి నాయుడు బావ పాటలు సుప్రసిద్ధం.

పాట వలె ప్రజలను చేరడం పద్యానికి, వచన కవిత్వానికి సాధ్యం కాలేదు. సాధ్యం కాదు కూడ. ఇటీవల బుల్లెట్ బండెక్కి వచ్చేత్త పా అనే పాట ఖండాంతరాలు విస్తరించింది. కొన్ని కోట్లముంది వీక్షించారు. దాన్ని మించి రాము రాథోడ్ పాట రాను బొంబాయికి పాట డెబ్బయి కోట్ల మంది వీక్షించారు. తెలుగు సాహిత్యంలో ఇదొక వరల్డ్ రికార్డు.

## సినిమా పాటల విశిష్టత

సినిమా పాటలు కోట్లాది మందిని అలరించాయి. వారి జీవితాల్లో భాగమయ్యాయి. సినిమా పరిమితి నుంచి విడి వడి కొన్ని వందల రెట్లు స్వతంత్రంగా ప్రజల హృదయాల్లోకి చేరి పోయాయి. అది పాట ప్రక్రియ గొప్ప తనం. తాను రాసింది తనకే గుర్తు లేక పుస్తకం చూసి చదవడానికి వచన కవిత్వం పరిమితమై పోయింది.

సినిమా పాట పై పైడిపాల పిహెచ్డీ చేశారు. లలిత గీతాలపై వడ్డేపల్లి కృష్ణ పీహెచ్డీ చేశారు. ఉద్యమ పాటపై పసునూరి రవిందర్ పిహెచ్డీ చేశారు. దీర్ఘ వచన కవితలపై నెల్లురు నుండి పిహెచ్డీ చేశారు. ప్రకాశ్ నుండి పల్లేరు వీర స్వామి శతక సాహిత్యంపై పీ హెచ్డీ చేశారు. ఇలా పాట పై పరిశోధనలను వేల్ల మీద లెక్క పెట్ట వచ్చు. అదే సమయంలో వచన కవిత్వం పై లెక్క లేనన్ని పరిశోధనలు జరిగాయి, జరుగుతున్నాయి. మధ్య తరగతి ని బాగా ఆకర్షించే ప్రక్రియ గనక వచన కవిత్వంపై పరిశోధనలు కొత్త పుంతలు తొక్కాయి.

## అంతేనా!

అర్థం కాని భాషలో రాయడం కొందరికి బాగా ఇష్టం. సాగదీసిన కొద్దీ అనేక అర్థాలు వచ్చే విధంగా రాయడం వారికి చాలా యిష్టం. మను ధర్మ పరాయణులు , వర్ణాధిక్య వాదులు, పాండిత్య ప్రదర్శకులు సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లీషు పదాలతో, సమాసాలతో రావణుడు చదివిన శివాష్టకంలా పరమ గంభీరంగా రాయడం ఇష్టం.

## అంతే అంతే

మాటల మధ్యలో జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణ రెడ్డి గారితో ఓ మాట చెప్పాను. ఓ యాభయి ఏండ్లు పోయినంక మీ వచన కవిత్వం కన్నా మీ సినిమా పాటలు, గజల్లే నిలుస్తాయి. వచన కవిత్వం మిగలదు అని అన్నాను. అంతేనంటవా రాములు అన్నారు. ఔను సార్! అన్నాను. సినిమా పాట, సినిమా తో పాటు రేడియో లో, టీవీలో, ఫంక్షన్లలో రకరకాల సందర్భాల్లో ప్రచారమవుతుంది. సంగీత దర్శకుని పేరిట , దర్శకుని పేరిట, హీరో, హీరోయిన్ను పేరిట, కవి పేరిట, సంగీతం పేరిట .., ఇలా రకరకాలుగా నిరంతరం ప్రచారంలో వుంటుంది.

ఇలా సినిమా పాటను అనేకమంది అనేక తీరుల్లో మోసుక పోతారు. అలా నిరంతరం వ్యాప్తి చెందుతుంది. వచన కవిత్వానికి ఈ హంగులు లేవు కదా అన్నాను.

## తనదారి తాను వెతుక్కున్న వచన కవిత్వం

ఈ విషయం గమనించిన వచన కవిత్వం తనదారి తాను వెతుక్కుంది. శీలా వీర్రాజు వచన కవిత్వంలో కథలు రాసారు. అది ప్రయోగంగా మిగిలి నిలిచి పోయింది. దీర్ఘ కవితలు, కవితలు, మనీ కవితలు, నానీలు, రెక్కలు, చుక్కలు, సప్త పది, హైకూలు , మినీ కవిత , దీర్ఘ కవిత, దీర్ఘ కావ్యం వంటి అనేక సైజులకు , రూపాలకు విస్తరించింది వచన కవిత్వం. వచన కవిత్వంలో దేవరకొండ బాల గంగాధర్ తిలక్ గారి అమృతం కురిసిన రాత్రి అనే వచన కవితా సంపుటి పేరెన్నిక గన్నది. వచన కవిత్వంలో సి. నారాయణ రెడ్డి గారు విశ్వంభర వచన కవిత్వ దీర్ఘ కావ్యానికి జ్ఞానపీఠ పురస్కారం పొందారు. ఒక హిందీ కవి నా కవితా సంపుటికన్నా నా సినిమా పాటలకు జ్ఞాన పీఠ పురస్కారం ఇస్తే ఇంకా ఎక్కువ సంతోషించే వాన్ని అన్నారు. వైర ముత్తు అనే తమిళ కవి పద్మశ్రీ , పద్మ భూషన్, అందుకున్నాయనకు జ్ఞాన పీఠ పురస్కారం ప్రకటించడం వివాదాస్పదంగా మారింది. వైర ముత్తు కూడా సినిమా రంగానికి చెందిన వారే.

## మినీ కవిత్వంలో అలిశెట్టి మేటి

మినీ కవిత్వంలో అలిశెట్టి ప్రభాకర్ లక్షలాది హృదయాలకు చేరువయ్యారు. వచన కవిత్వంలో కావ్యాలు రాయాలని సి వి గారు సత్యకామ జాబాలి, ప్యారిస్ కమ్యూన్ రాసారు. జాషువా పద్య ప్రకియయే తనకు ముద్దు అని అందులోనే ఆధునిక కవితా వస్తువుతో ఉన్నత శిఖరాలకు ఎదిగారు. దాశరథి కృష్ణమాచార్య అటు సినిమా పాటలు, ఇటు పద్య కృతులు వెలయించారు. వారి అనువాద గాలిబ్ గీతాలు ఎంతో మధురం. దాశరథి వచన కవిత్వం రాసినట్టు గుర్తు లేదు.

## కాళోజీ బాట

కాళోజీ తొలి నుంచి ఆశు సంప్రదాయ రీతిలో వేమన వలె సమాజాన్ని పలు రీతుల్లో హెచ్చరించాడు. సందేశాత్మక, ఉపదేశాత్మక కవిత్వ గేయ సరళిలో రాసారు. ఎక్కడి కక్కడ నోటికి పాడి వినిపించి ప్రజల్లోకి ప్రవహించారు.

వచన కవిత్వం తనకు తానే బందీ అయిన విధం

వచన కవిత్వం ప్రజలకు పోను పోను పద్యం కన్నా కష్టంగా మారిపోతూ వచ్చింది. రాయడమూ కష్టమే. అర్థం చేసుకోవడమూ కష్టమే , యాదికి ఉంచుకోవడమూ కష్టమే అనే

ఒకానొక కార్నర్ కు చేరింది. హిందీలో ఉర్దూలో ఈ సమస్య ఇలా లేదు. పద్యం పాటలాగా పాడి కొనసాగుతున్నది.

## పుస్తకం పేరులేని ముఖ చిత్రంతో ఎస్వీ రామారావు కవిత్వం

పెయింటింగ్ ఆర్టులో ఆబ్ స్ట్రాక్టు పెయింటింగ్ కళ ఒక శాఖగా అనేక రకాలుగా విస్తరించింది. చికాగో లో కలుసుకున్నపుడు సుప్రసిద్ధ ఆర్టిస్టు పద్మశ్రీ ఎస్వీ రామారావు గారు తన కవితా సంపుటి ఇచ్చారు. దాని మీద తన పేయింటింగ్ ముఖ చిత్రంగా వేసారు. బాగానే వుంది గాని పుస్తకం పేరే వేయ లేదు. ఆశ్చర్యంగా అడిగాను. కవర్ పేజి యే చెప్తుంది మళ్లీ పేరెందుకు అన్నారు. లోపల ఆ పుస్తకం పేరు కాలాంతరాలు. ఆధ్యాత్మిక కవితా సంకలనం అని ట్యాగ్ లైన్. వేగుంట మోహన్ ప్రసాద్, ప్రొ. టి గౌరీశంకర్ మొదలైన వారు ముందు మాటలు రాసారు.

## మో.. గుంటూరు శేషేంద్ర శర్మ .. శివారెడ్డి

మో గారి కవిత్వం కూడా ఇలాగే ప్రత్యేకమైనది. గుంటూరు శేషేంద్ర కవిత్వమే గొప్పది. శివా రెడ్డి కవిత్వమే గొప్పది . అలాంటి కవిత్వమే గొప్పది . నేను మెచ్చిన కవిత్వవే గొప్పది అనుకునే వారున్నారు. అలా అనుకునే హక్కు వారికుంది. కాని ఆ మాటను అందరు ఆమోదించాలి. అలానే రాయాలి అనడమే చిక్కులు తెస్తుంది. తాను మునిగిందే గంగ.. తాను వలచిందే.. తిలోత్తమ. లోకోత్తమ. ప్రవరాఖ్య అనుకోవచ్చు. అది గొప్ప స్ఫూర్తిని తృప్తిని ఇస్తుంది. అందుకు అభ్యంతరం ఏమీ లేదు గానీ అది మాత్రమే గొప్ప కవిత్వం. అట్లా రాస్తేనే గొప్ప కవిత్వం అని మిగతాది కవిత్వమేకాదనడం అనేక చిక్కులు తెచ్చి పెడుతుంది.

## నాదే గొప్ప అనుకోవడం

లక్ష యాభయి వేల ఓట్ల మెజారిటీతో గెలిచినాయన కన్నా నాకొచ్చిన పదహారు వేల ఐదు వందల ఓట్లు గొప్పవి, విలువైనవి, చైతన్య వంతులవి. మిగతా వారివి గొర్రె దాటు ఓట్లు అని గెలిచిన వారిని కొందరు హేళన చేస్తూ తామే గొప్ప అనుకుంటారు. మాది చొక్కా బంగారం అంటారు. ఒప్పుకో మంటారు. ఆ బంగారం వారి మెడను అలంకరిస్తుంది తప్ప మనకు అందేది కాదు కద అంటారు జనం.

## ప్రజాస్వామ్యంలో సాహిత్యం

సాహిత్యానికి ఒక ప్రయోజనముంది. ప్రజాస్వామ్యంలో ప్రజలకు స్ఫూర్తినివ్వాలి. హృదయాలను కదిలించాలి. ప్రజలు తమ భావాలకు అదొక గొంతుగా తాదాత్మ్యం చెందాలి. బుల్లెట్ బండెక్కి వచ్చేత్త పా! అనే పాట ప్రతి ఆడపిల్ల హృదయంలో నిలిచి పోతుంది. ఆనంద పరవశంతో పాడుకుంటుంది.

కవిత్వం ఇలా సాహిత్య మౌలిక లక్ష్యం నెరవేర్చాలి. ప్రజల సాహిత్య అవసరాలను తీర్చాలి. సాహిత్య ప్రయోజనం నెర వేర్చాలి. తన ప్రతిభా సామర్థ్యాలతో ఆధిక్యత ప్రదర్శించి ప్రజలకు అందని, అర్థం కాని కవిత్వాన్ని రాస్తే ప్రజలకు చేరడం తక్కువ. శాస్త్రీయ సంగీతం, ఆబ్ స్ట్రాక్టు పెయింటింగ్ తక్కువ మంది ఇష్ట పడుతారు. గద్దర్, గూడ అంజయ్య, జయ రాజు, గోరటి వెంకన్న, అందెశ్రీ కవిత్వాన్ని పాటను కోట్లాది మంది ఇష్ట పడుతారు. వాటితో స్ఫూర్తి పొందారు. ఉద్యమాల్లోకి ప్రజలు ప్రవాహంలా కదలి వచ్చారు. వారు రాసేవన్నీ తేలిక పదాలే. అందెశ్రీ కాస్త పండిత పాలు సమాసాలు కూడా ప్రయోగిస్తారు. నది నడిచి పోతున్నది అనే ప్రపంచ నదుల పై రాసిన కావ్యం కాళిదాసు కన్నా గొప్ప కావ్యం.

## అర్థంకాని ప్రతీకలు, పద చిత్రాలు, మొదలైన వాటితో కూడిన వాటిని

కవిత్వంలో భాగంగా కాకుండా కవిత్వ శైలీ శిల్ప పరిణామ చరిత్రలో భాగంగా చూడాలి. నలభయి ఏళ్ల క్రితమే అరుణతారలో చెప్పిన మాటనే మరోసారి గుర్తు చేస్తున్నాను.

చిత్ర కవిత్వం కింది నుంచి పైకి చదవడం, ఒక పద్యంలో రెండు పద్యాలు పొద గడం, ఒకే పద్యం ఒకటికి మించి నానార్థాలు ఇమడ్చడం మొదలైనవి అలంకార శాస్త్ర చర్చకు ఉపయోగం. అవి సాహిత్య మౌలిక లక్ష్యమైన సాహిత్య ప్రయోజనానికి సంబంధించి వాటి ప్రభావం తక్కువ. కనక అందరికి అర్థమయ్యే కవిత్వమే ఆదరణ పొందుతుంది.

అయితే నేటి వచన కవిత్వం , రస సృష్టి కన్నా , వస్తు విశ్లేషణకు , వస్తువును తాత్వీక రించి అలంకారికం, సౌందర్యాత్మకం చేయడంలో ప్రత్యేకతను సాధించింది..

